RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక : 241 సంపాదకులు: కలిచేటి వెంకయ్య సోమవారం 27 జులై 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

## మంత్రి నారాయణతో బై దేశీ ప్రతినిధుల భేటీ



వివరాలు 3లో

## విలేకరులు కావలెను

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0



## విద్యార్థులపై ప్రాణాంతక దాడికి అనుమతిచ్చింది మీరు కాదా? అమిత్ షాకు రాహుల్ గాంధీ ఘాటు లేఖ

- కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లేఖ
- జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై దాడిని ఖండించిన రాహుల్
- శాంతియుత నిరసనపై పెల్లెట్ గన్లు వాడారని తీవ్ర ఆరోపణ
- దాడికి అనుమతి ఎవరు ఇచ్చారో చెప్పాలని లేఖలో డిమాండ్
- మహిళా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శ

**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత వారం విద్యార్థులపై జరిగిన పోలీసు దాడి ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. విద్యార్థులపై జరిగిన ఈ "క్రూరమైన దాడి"కి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆయన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఆదివారం ఒక లేఖ రాశారు. ఈ దాడిలో మిగతా 2లో...

## మన యువశక్తిని చూసి గర్వపడుతున్నా

# 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

- దేశ యువశక్తిపై గర్వంగా ఉందన్న ప్రధాని మోదీ
- 'మన్ కీ బాత్'లో యువత సాధించిన విజయాల ప్రస్తావన
- 'విక్రమ్-1' ప్రయోగంతో అంతరిక్ష రంగంలో నవశకం
- సైన్స్ ఒలింపియాడ్స్‌లో స్వర్ణ పతకాలతో సత్తా చాటిన విద్యార్థులు



**ఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 136వ ఎపిసోడ్‌లో దేశ యువత సాధిస్తున్న విజయాలపై ప్రశంసల వర్షం కురిపించారు. అంతరిక్షం నుంచి సైన్స్ ఒలింపియాడ్స్ వరకు వివిధ రంగాల్లో యువత అద్భుత ప్రతిభ కనబరుస్తోందని, దేశ యువశక్తిని చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని అన్నారు. ఇటీవల విజయవంతమైన 'విక్రమ్-1' ప్రయోగం ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వంతో నింపిందని మోదీ పేర్కొన్నారు. ఇది వికసిత భారత్ లక్ష్యంలో ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి రాకెట్ అని, భారత అంతరిక్ష రంగంలో ఇదొక చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. ఒకప్పుడు ఊహించలేనిదాన్ని మన యువ ఆవిష్కర్తలు సుసాధ్యం చేశారని, వారిలో అసాధారణ నైపుణ్యం, పట్టుదల ఉన్నాయని కొనియాడారు. చాలాకాలంగా ప్రైవేటు రంగానికి దూరంగా ఉన్న అంతరిక్ష రంగాన్ని యువత ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని తెరిచామని, దాని ఫలితాలను మిగతా 2లో...

## 21 ఏళ్లకే ఎమ్మెల్యే, ఎంపీ.. కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రతిపాదన


- శాసనసభ, లోక్‌సభ ఎన్నికల వయోపరిమితి 21కి తగ్గించాలని రేవంత్ డిమాండ్
- 21 ఏళ్లకే ఐఏఎస్, మేయర్లు అవుతున్నప్పుడు ఎమ్మెల్యేలు ఎందుకు కాకూడదని ప్రశ్న
- ఆగస్టులో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్న సీఎం
- గుజరాత్‌లాగే తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి



హైదరాబాద్ (సింధూర దర్శిని) 26 జూలై : యువతను చట్టసభల్లోకి పెద్ద ఎత్తున తీసుకురావాలనే లక్ష్యంతో, శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 21 ఏళ్లకే యువత సివిల్ సర్వెంట్లుగా, మేయర్లుగా బాధ్యతలు చేపడుతున్నప్పుడు, వారికి చట్టసభల్లో పోటీ చేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదని ఆయన ప్రశ్నించారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్ రెడ్డి ఈ విషయాలు వెల్లడించారు. "21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, జిల్లా పంచాయతీ మిగతా 2లో...

## నేడు కృష్ణా జిల్లాలో నారా లోకేశ్ పర్యటన

- సోమవారం (జులై 27) కృష్ణా జిల్లాలో పర్యటించనున్న మంత్రి నారా లోకేశ్
- పెనమలూరు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు
- పునాదిపాడులో నూతన బాలికల జూనియర్ కళాశాల భవనం ప్రారంభోత్సవం
- టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశంలో భేటీ




అమరావతి (సింధూర దర్శిని) 26 జూలై రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ రేపు సోమవారం (జూలై 27) కృష్ణా జిల్లాలో పర్యటించనున్నారు. పెనమలూరు నియోజకవర్గంలో ఆయన పలు అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఆయన పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ విడుదలైంది. పర్యటన వివరాల ప్రకారం, సోమవారం ఉదయం 10:15 గంటలకు లోకేశ్ కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నూతనంగా నిర్మించిన బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శిస్తారు. ఈ కార్యక్రమాలు మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయి. మధ్యాహ్నం 1:00 గంట నుంచి 2:30 గంటల వరకు కంకిపాడులోని అయానా కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమంలో లోకేశ్ పాల్గొంటారు. పెనమలూరు మిగతా 2లో...

# నేటి నుంచి టీడీపీ ఇంటింటి ప్రచారం

## నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

- రెండేళ్ల కూటమి పాలనపై నేటి నుంచి 45 రోజుల పాటు డోర్ టు డోర్ ప్రచారం
- ప్రభుత్వ విజయాలను, హామీల అమలును ప్రజలకు వివరించాలని నేతలకు చంద్రబాబు ఆదేశం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలవడమే లక్ష్యంగా పనిచేయాలని సూచన
- అనుచరులుగా కాదు, నాయకులుగా ఎదగాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- గొడ్డలి పార్టీ విధ్వంసకర విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని దిశానిర్దేశం



అమరావతి (సింధూర దర్శిని) 26 జూలై ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రేపటి నుంచి (సోమవారం) 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'డోర్ టు డోర్' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ బృహత్ కార్యక్రమంలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంత్రుల నుంచి బూత్ స్థాయి కన్వీనర్ల వరకు పార్టీ యంత్రాంగం మొత్తం ఈ అవుట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని గుర్తుచేశారు. "94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్లతో మిగతా 2లో...

## కేంద్ర నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి



- విద్యార్థుల నిరసనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- నూతన విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు
- విద్యార్థి సంఘాలతో కేంద్ర మంత్రుల చర్చలు సఫలం కావడంతో ఆందోళనల విరమణ
- తనపై నమ్మకం ఉంచిన ప్రధానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రహ్లాద్ జోషి

**ఢిల్లీ:** కేంద్ర విద్యాశాఖ నూతన మంత్రిగా సీనియర్ నేత ప్రహ్లాద్ జోషి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ శనివారం కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. ఈ క్రమంలో, కొత్త విద్యాశాఖ మంత్రిగా మిగతా 2లో...

## రోజాకు నోటీసులు.. ఈ నెల 30న విచారణ



- మాజీ మంత్రి రోజాకు పోలీసు నోటీసులు
- రాజకీయ కక్షసాధింపుతోనే తనపై అక్రమ కేసులు పెట్టారన్న రోజా
- 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలు చేస్తున్నారని ప్రభుత్వంపై విమర్శ
- ఆంధ్రజ్యోతి పత్రిక ప్రతులు దహనం చేసినందుకే కేసు అని వెల్లడి
- విచారణకు ఈ నెల 30న హాజరుకావాలని ఆదేశం

తిరుపతి (సింధూర దర్శిని) 26 జూలై వైసీపీ మహిళా నేత, మాజీ మంత్రి రోజాకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఓ పత్రిక ప్రతులను దహనం చేసిన కేసులో విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. చిత్తూరు జిల్లా నగరిలోని ఆమె నివాసానికి మిగతా 2లో...

## కేంద్ర నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి

(మొదటిపేజీ తరువాయి)

ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు అప్పగించారు. నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో, 36 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలతో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల దృష్ట్యా, తాను ప్రధాని నరేంద్ర మోదీకి రాజీనామా సమర్పించినట్లు ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్' వేదికగా నిన్న ప్రకటించారు. ఆయన రాజీనామా చేసిన కాసేపట్లోనే ప్రహ్లాద్ జోషికి ఈ కీలక శాఖను అప్పగించారు.నేడు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రహ్లాద్ జోషి సోషల్ మీడియాలో స్పందించారు. "కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఈరోజు బాధ్యతలు స్వీకరించాను. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు. వినయంతో, కర్తవ్య నిష్ఠతో ఈ బాధ్యతను స్వీకరిస్తున్నాను" అని పేర్కొన్నారు.కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి, ధార్వాడ్ లోక్‌సభ స్థానం నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలుపొందారు. గతంలో పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖల మంత్రిగా పనిచేశారు. 2024 ఎన్నికల అనంతరం వినియోగదారుల వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖలను నిర్వహించారు.

## రోజాకు నోటీసులు.. ఈ నెల 30న విచారణ

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లిన తిరుపతి ఈస్ట్ పోలీసులు, ఈ నెల 30న విచారణకు రావాలని నోటీసుల్లో స్పష్టం చేశారు.కొన్ని రోజుల క్రితం, తమ పార్టీ నాయ కుల కుటుంబాల్లోని మహిళలను కించపరిచేలా ఓ దినపత్రికలో అస త్య కథనాలు ప్రచురించారని ఆరోపిస్తూ రోజా నిరసన తెలిపారు. అందులో భాగంగా పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ ఘటనపై నమోదైన కేసులో భాగంగానే పోలీసులు తాజాగా నోటీసులు అందజేశారు.

**ఇది రాజకీయ కక్షసాధింపే: రోజా**

కూటమి ప్రభుత్వం తనపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అందులో భాగంగానే అక్రమ కేసులు బనాయించిందని రోజా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పోలీసులు నోటీసులు అందజేసిన అనంతరం రోజా మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, కూటమి ప్రభుత్వం 'రెడ్ బుక్ రాజ్యాంగాన్ని' అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. వైసీపీ అధినేత జగన్ తో పాటు, పార్టీ నాయకుల కుటుంబాల్లోని మహిళలను కించపరిచేలా ఆంధ్రజ్యోతి పత్రికలో అవాస్తవ కథనాలు ప్రచురించారని, అందుకే నిరసనగా ఆ పత్రిక ప్రతులను దహనం చేశామని స్పష్టం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపితే కేసులు పెట్టడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని రోజా ఆరో పించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయని, మహిళలకు, చిన్నారులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రతను గాలికి వదిలేసిన ప్రభుత్వం, కేవలం పేపర్లు దహనం చేసినందుకు తమకు నోటీసులు ఇవ్వడం పక్షపాత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి, ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టడంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందని విమర్శించారు.ప్రభుత్వం చేసే తప్పు లను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకే ఇలాంటి కక్షపూరిత కేసులు పెడుతున్నారని రోజా అన్నారు. ప్రజాస్వా మ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని గుర్తుచేశారు. ఇటువంటి బెదిరింపులకు, అక్రమ కేసులకు వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఎవరూ భయపడరని ఆమె తేల్చి చెప్పారు. తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమపై బనాయిం చిన అక్రమ కేసులను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని రోజా డిమాండ్ చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలను అణచివేయాలని చూడటం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

## నేటి నుంచి టీడీపీ ఇంటింటి ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

మనం గెలిచాం. నాటి ప్రభుత్వ విధ్వంసం, ఘోర తప్పిదాల వల్లే 151 సీట్ల పార్టీ 11 సీట్లకు పడిపోయింది" అని ఆయన వ్యాఖ్యాని ంచారు. కూటమి పార్టీల పోరాటాలు, ఎన్నికల వ్యూహాల వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని తెలిపారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. "ఎన్నికల సమ యంలో ఓట్ల కోసం ఎలాగైతే ప్రతి ఇంటికీ వెళ్లారో, ఇప్పుడు కూడా అదే విధంగా వెళ్లి మనం ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తు న్నామో చెప్పాలి.

**నాకు కావాల్సింది అనుచరులు కాదు!**

పార్టీలో నాయకత్వ పటిమను పెంచుకోవాల్సిన ఆవశ్యకతను చంద్రబాబు నొక్కిచెప్పారు. "నాకు కావాల్సింది అనుచరులు కాదు, పార్టీకి నాయకులు కావాలి. సమస్యలకు పరిష్కారం చూపే నైపుణ్యాలను అలవర్చుకోవాలి. కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేస్తూ ప్రజలు, కార్యకర్తలతో సన్నిహితంగా మెలగాలి" అని ఆయన హితవు పలికారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు.గొడ్డలి పార్టీవిధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని చంద్రబాబు కోరారు. "ఘోర ఓటమి చవిచూసినా ఆ పార్టీ ఇప్పటికీ సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోంది. వారి విధ్వంసకర విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. యువతను వారు ఏ విధంగా నిర్వీర్యం చేశారో, యువత భవిత కోసం కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి" అని ఆయన అన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమైతేనే ప్రతిపక్ష కుట్రలను ఎండగట్టగలమని స్పష్టం చేశారు. "మళ్లీ కూటమి అధికారంలోకి రావడం ఖాయం, కానీ ఏమరుపాటు వద్దు. రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం కొనసాగాల్సిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ వివరించాలి" అని ఉద్బోధించారు. ప్రజల్లో ఉండటాన్ని ప్రతి నాయకుడు బాధ్యతగా స్వీకరించాలని కర్తవ్య బోధ చేశారు.

## నేడు కృష్ణా జిల్లాలో నారాలోకేశ్ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన ప్రసంగించనున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు, టీడీపీ శ్రేణులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు.

# ప్రగఢ కోటయ్య గారి 111 వ జయంతిలో మంత్రి సవిత

బాపట్ల (సింధూర దర్శిని) 26 జులై :చేనేతల సమస్యల ఉద్యమ పితామహుడు ప్రగఢ కోటయ్య అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత మరియు జౌళి, బీసీ సంక్షేమ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. ఆదివారం, చీరాల పట్టణంలోని పద్మశాలి బహుమతమ్మ సంఘ కళ్యాణ మండపంలో ప్రగఢ కోటయ్య 111వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.చేనేత రంగ అభివృద్ధికి ప్రగఢ కోటయ్య చేసిన సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేనేత మరియు జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగఢ కోటయ్య 111వ జయంతి వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత మరియు జౌళి, బీసీ సంక్షేమ మరియు ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత ముఖ్య అతిథిగా హాజరై, చేనేతచే తయారు చేయబడిన వస్త్రాల ప్రదర్శనను ఆమె తిలకించారు. అనంతరం వేదికపై ఏర్పాటు చేసిన ప్రగఢ కోటయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర చేనేత మరియు జౌళి ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్ పి సిసోడియా, చేనేత మరియు జౌళి కమిషనర్ రేఖా రాణి, బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి, చీరాల శాసనసభ్యులు ఎం ఎం మాలకొండయ్య, జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ, ఇతర ప్రజా ప్రతినిధులు తో కలిసి మంత్రి జ్యోతి వెలిగించారు. కార్యక్రమాన్ని మా తెలుగు తల్లి గీతంతో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత మరియు జౌళి, బీసీ సంక్షేమ మరియు ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ, కోటయ్య అంటే చేనేత, చేనేత అంటే కోటయ్య అని ఆమె అన్నారు. చేనేతల కోసం అహర్నిశలు కష్టపడిన వ్యక్తి ప్రగఢ కోటయ్య అని ఆమె అన్నారు. ఆయన చేనేతలకు చేసిన సేవను ప్రభుత్వం గుర్తించి ఆయన 111వ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగ గా చీరాలలోజరుపుకుంటున్నామని, ఈ కార్యక్రమం ప్రతి జిల్లాలో జరుగుతున్నట్లు ఆమె చెప్పారు. చేనేత కార్మికులకు, చేనేత రంగానికి సహకార సంఘాలు ఎంత ప్రయోజనం చేకూరిస్తాయని గట్టిగా నమ్మిన స్వాతంత్ర సమరయోధుడు ప్రగఢ కోటయ్యని ఆమె చెప్పారు. చేనేతల సమస్యలను గల్లీ నుండి ఢిల్లీకి వినిపించిన వ్యక్తి కోటయ్యని ఆమె చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత కార్మికుల సొసైటీలు సహకార సంఘాలు (APCO) వ్యవస్థాపక వ్యక్తిగా ఆమె ఆయన్ను అభివర్ణించారు. కోటయ్య గారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని ఆమె చెప్పారు. ఆయన అడుగుజాడల్లో ఇప్పుడి ప్రభుత్వం చేనేతలకు అండగా నిలుస్తుందని ఆమె అన్నారు. ప్రభుత్వం 50 సంవత్సరాలు నిండిన చేనేతలకు పింఛన్ అందిస్తుందని





ఆమె అన్నారు. హ్యాండ్లూమ్స్ కు 200 యూనిట్లు, పవర్ లూం లకు 500 యూనిట్లు విద్యుత్ ఉచితంగా అందిస్తున్నట్లు ఆమె చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోలేనప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన చేనేతలందరికీ 25 వేల రూపాయలు నేతన్న సేవ కింద రాబోవు మాసంలో అందజేస్తున్నట్లు ఆమె చెప్పారు. చేనేతల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం దృష్టి పెట్టిందని ఆమె చెప్పారు. ప్రగఢ కోటయ్య జయంతి సందర్భంగా మంగళగిరిలో 10 ఎకరాలలో స్మృతి వనం నిర్మాణానికి రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకున్నట్లు ఆమె చెప్పారు. సెర్ఫ్ లో 19 కోట్లతో చీరాలలో క్లస్టర్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆమె చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బీసీల అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. బీసీలందరూ ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత మరియు జౌళి ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్ పి సిసోడియా మాట్లాడుతూ, బ్రిటిష్ వారి పాలనలో బ్రిటిష్ వారు భారతీయ టెక్స్టైల్స్ పై మొదట దాడి చేశారని, ఆ దాడిని ఎదిరించి, చేనేతలకు పెద్ద దిక్కుగా నిలబడిన వ్యక్తి ప్రగఢ కోటయ్యని ఆయన అన్నారు. సహకార సంఘాలు, స్పిన్నింగ్ మిల్స్ ఏర్పాటులో ఆయన చేయూత చాలా ఉందన్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించి ఆయన పుట్టిన రోజు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగ నిర్వహిస్తుందని ఆయన చెప్పారు. చేనేతలందరూ ఆయనకు రుణపడి ఉంటారని అన్నారు. అందరూ చేనేతను అభివృద్ధి చేయుటకు కృషి చేయాలన్నారు. చేనేతలకు ఆర్థిక వెసులుబాటుగా ప్రభుత్వం 25 వేల రూపాయలు ( మగ్గం మీద పనిచేసే వారందరికీ) అందజేయుటకు చర్యలు తీసుకుందని ఆయన చెప్పారు. చేనేతలు వారు చేసే పనిలో నాణ్యత తగ్గకుండా పనిచేయాలన్నారు. ఈరోజున చేతితో తయారు చేసే వస్త్రాలకు ఎక్కువ డిమాండ్ ఉందని ఆయన అన్నారు. ఇది వ్యక్తి యొక్క శ్రమతో కూడినదని, చేనేత రంగం ఇంకా బాగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా చీరాల శాసనసభ్యులు ఎం ఎం మాలకొండయ్య మాట్లాడుతూ, చీరాల ప్రజలు ప్రగఢ కోటయ్య ను మర్చిపోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పూనుకుందని ఆయన అన్నారు. చీరాలలో వారి విగ్రహం పెట్టడానికి ప్రభుత్వం అంగీకరించినట్లు ఆయన తెలిపారు. ప్రగఢ కోటయ్య 1915 వ సంవత్సరంలో పద్మశాలి కుటుంబానికి చెందిన ప్రగఢ వీరభద్రుడు, కోటమ్మ దంపతులకు రెండవ కుమారుడుగా జన్మించారని ఆయన చెప్పారు. కోటయ్య సుదీర్ఘంగా రాజకీయాల్లో ఉంటూ, ఆంధ్రా, మద్రాస్,భారత దేశంలో గుర్తింపు పొందిన వ్యక్తిగా ఎదిగారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు ఎప్పుడు అండగా ఉంటుందని, కుప్పడం చీరలకు జాతీయ గుర్తింపు తెచ్చిందని, తద్వారా ప్రపంచవ్యాప్తంగా వాటి డిమాండ్ పెరిగిందని ఆయన చెప్పారు. చేనేతలకు మార్కెటింగ్, టెక్స్టైల్ పార్క్ లు ఏర్పాటు చేసిందన్నారు. 200 యూనిట్లు హ్యాండ్లూమ్ కు, 500 యూనిట్లు పవర్లూమ్ కు ఉచిత విద్యుత్తును అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. కోటయ్య అందరికీ మార్గదర్శిని, వారు చూపిన మార్గంలో ముందుకు వెళ్తూ అభివృద్ధి సాధించాలన్నారు.కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ ప్రగఢ కోటయ్య గారి జన్మదిన వేడుకల సందర్భంగా కోటయ్య చేనేతలకు చేసిన సేవనుస్మరించుకున్నారు .

కార్యక్రమంలో ప్రగఢ కోటయ్య కుమారుడు వెంకట శేష సైన్ కోడలు పద్మావతి, కుమార్తె పద్మావతి అల్లుడు ప్రభాకర్ మరియు మనవరాలు జగతికి కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులు వారిని సత్కరించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అతిథులందరికీ జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత మరియు జౌళి సంచాలకులు రేఖ రాణి, బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ వి,ఎమ్మెల్సీ సునీత, పద్మశాలి కార్పోరేషన్ చైర్మన్ అబద్దయ్య, టిడిపి పొలిట్ బ్యూరో మెంబర్ ధనుంజయ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాపారావు, ఆప్కో ఎం.డి కన్నబాబు, చేనేత మరియు జౌళి ఉపసంచాలకులు బి వెంకటేశ్వరరావు, సహాయ సంచాలకులు వెంకటేశ్వరరావు, జిల్లా, మండల స్థాయి అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మన యువశక్తిని చూసి గర్వపడుతున్నా 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

నేడు ప్రపంచం చూస్తోందని వివరించారు.అంతరిక్ష రంగంలోనే కాకుండా, సైన్స్ రంగంలోనూ మన యువత దేశానికి గర్వకారణంగా నిలుస్తోందని ప్రధాని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సైన్స్ ఒలింపియాడ్స్‌లో భారత విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచారని చెప్పారు. ఈ నెలలో జరిగిన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్స్‌లో మన విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. ఫిజిక్స్ ఒలిం పియాడ్స్‌లో మన ఐదుగురు విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించారని, దీంతో భారత్ మొదటి స్థానంలో నిలిచిం దని మోదీ హర్షం వ్యక్తం చేశారు.గత పదేళ్లుగా ఫిజిక్స్ ఒలింపియాడ్స్‌లో భారత విద్యార్థులు స్వర్ణ లేదా రజత పతకాలు సాధిస్తూ వస్తున్నారని గుర్తుచేశారు. కెమిస్ట్రీ ఒలింపియాడ్స్‌లో పాల్గొన్న విద్యార్థులందరూ స్వర్ణ పతకాలు గెలుచుకున్నారని, ఇది ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన అని పేర్కొన్నారు. అలాగే, బయాలజీ ఒలింపియాడ్స్‌లో స్వర్ణంతో సహా పలు పతకాలు, మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్స్‌లో రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు సాధించారని వివరించారు. దేశ యువశక్తిని చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని అన్నారు. భవిష్యత్తులో మరింత మంది యువత ఇలాంటి ఒలింపియాడ్స్, హ్యాకథాన్స్‌లో పాల్గొని దేశానికి గర్వకారణంగా నిలుస్తారన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# 21 ఏళ్లకే ఎమ్మెల్యే, ఎంపీ.. కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రతిపాదన

(మొదటిపేజీ తరువాయి)

చైర్‌పర్సన్‌లుగా నియమిస్తున్నాం. అలాంటప్పుడు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఎందుకు అనుమతించకూడదు? దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న 'జెన్-జీ' తరం గొంతుక చట్టసభల్లో వినిపించాలి. వారికి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా పనిచేసే అవకాశాలు రావాలి" అని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో రాష్ట్ర శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, వయోపరిమితి తగ్గింపు కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిస్తామని సీఎం ప్రకటించారు. గతంలో రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారని, ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన గుర్తుచేశారు.ఇదే సందర్భంగా తెలంగాణ అభివృద్ధిపైనా రేవంత్ మాట్లాడారు. రీజనల్ రింగ్ రోడ్, మెట్రో రైల్, మూసీ నది అభివృద్ధి వంటి ప్రాజెక్టులపై తుది నిర్ణయాలు రావాల్సి ఉందని తెలిపారు. "ప్రధాని మోదీ ఈ దేశానికి ప్రధాని. ఆయన గుజరాత్‌ను, తెలంగాణను వేర్వేరుగా చూడకూడదు. గుజరాత్ తరహాలోనే తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి. వికసిత భారత్ లక్ష్యంలో తెలంగాణ 10 శాతం వాటా అందించాలని కోరుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం దేశంలో ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే కనీస వయసు 25 సంవత్సరాలు. అదే, రాజ్యసభ సభ్యుడిగా, శాసనమండలి సభ్యుడిగా పోటీ చేయాలంటే కనీస వయసు 30 సంవత్సరాలు ఉండాలి.

# విద్యార్థులపై ప్రాణాంతక దాడికి అనుమతిచ్చింది మీరు కాదా?

## అమిత్ షాకు రాహుల్ గాంధీ ఘాటు లేఖ

(మొదటిపేజీ తరువాయి)

ప్రాణాంతకమైన పెల్లెట్ గన్లను ప్రయోగించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే, జూలై 20న జంతర్ మంతర్ వద్ద "న్యాయమైన, జవాబుదారీతనంతో కూడిన విద్యా వ్యవస్థ" కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపట్టారని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. అయితే, భద్రతా బలగాలు వారిపై విచక్షణారహితంగా బలప్రయోగం చేశాయని ఆరోపించారు. భాష్పవాయువుతో పాటు, ప్రమాదకరమైన పెల్లెట్ గన్లను కూడా వాడారని, ఈ దాడిలో వందలాది మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ముఖ్యంగా, మహిళా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని, వారి సున్నితమైన భాగాలపై దాడి చేశారని తీవ్రంగా ఆరోపించారు. ఈ ఘటనలో 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచాబ్ కంటికి పెల్లెట్ తగలడంతో, అతను శాశ్వతంగా కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉందని రాహుల్ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఉద్దేశించి ఆయన రెండు సూటి ప్రశ్నలు సంధించారు:

1. విద్యార్థులపై పెల్లెట్ గన్ల వంటి ప్రాణాంతక ఆయుధాలను ప్రయోగించడానికి హోం మంత్రిగా మీరు అనుమతి ఇచ్చారా? ఒకవేళ ఇవ్వకపోతే, ఆ అధికారం ఎవరిచ్చారు?
2. సాధారణ దుస్తుల్లో వచ్చి విద్యార్థులను లాఠీలతో కొట్టిన వ్యక్తులు ఎవరు? వారిని రంగంలోకి దించింది ఎవరు?

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థి ఆందోళనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. జంతర్ మంతర్ ఘటనకు అమిత్ షానే ప్రత్యక్ష బాధ్యుడని రాహుల్ గాంధీ గతంలోనే ఆరోపించారు. తాజాగా లేఖ రాయడం ద్వారా ఈ అంశంపై ఒత్తిడిని మరింత పెంచారు. అయితే, రాహుల్ గాంధీ లేఖపై కేంద్ర హోం శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే అవసరమైన చర్యలు తీసుకున్నామని ప్రభుత్వ వర్గాలు ఇదివరకే స్పష్టం చేశాయి.

# మంత్రి నారాయణతో బై దేశీ ప్రతినిధుల భేటీ



నెల్లూరు (సింధూర దర్శిని) 26 జూలై నెల్లూరు జిల్లా ; ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "వన్ ఫ్యామిలీ -- వన్ ఎంటర్‌ప్రెన్యూర్" లక్ష్య సాధనలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలను సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదించిన ప్రాసెసింగ్ ఢ ప్యాకేజింగ్ సెంటర్ల ఏర్పాటుపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణతో బై దేశీ ప్రతినిధులు, మెప్మా అధికారులు ఆదివారం సమావేశమయ్యారు. చింతారెడ్డి పాలెం లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కమీషనర్ నందన్ ,మెప్మా నెల్లూరు ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. కిరణ్ కుమార్, మెప్మా అధికారులు ఎల్‌హెచ్ బి. సుధాకర్, ఐబీ అంకయ్య, ఏఓ సుధాకర్, టీఈ (మార్కెటింగ్) కాంతయ్యతో పాటు బై దేశీ ప్రతినిధులు హర్ష రెడ్డి, కార్తీక్ పత్తిపాటి, షణ్మిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా బై దేశీ ప్రతినిధులు మాట్లాడుతూ మహిళలు కేవలం ఉత్పత్తులు తయారు చేయడానికే పరిమితం కాకుండా ప్రాసెసింగ్, బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్, మార్కెట్ లింకేజీల ద్వారా స్వయం ఉపాధి పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ఈ నమూనాను రూపొందించినట్లు మంత్రికి వివరించారు. బ్రాండ్ కింద నాణ్యమైన ఉత్పత్తులను రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా మార్కెట్ చేయడం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం, రైతులకు మెరుగైన ధరలు, స్థానిక ఉత్పత్తులకు విలువ ఆధారిత మార్కెట్‌ను కల్పించవచ్చని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా నెల్లూరు, గుంటూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ప్రాసెసింగ్ ఢ ప్యాకేజింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించే కార్యాచరణను కూడా మంత్రికి వివరించారు. ఈ ప్రాజెక్టు మహిళా సాధికారత, స్థానిక ఉపాధి కల్పన, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల ప్రోత్సాహం, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహదపడటంతో పాటు "ఆత్మనిర్భర్ ఆంధ్రప్రదేశ్" లక్ష్య సాధనకు బలమైన మద్దతుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతిపాదనలోని అంశాలను మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆసక్తిగా పరిశీలించి, మహిళల ఆదాయాన్ని పెంచే విధంగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్న ఈ నమూనాపై అధికారులతో సానుకూలంగా చర్చించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే ఇటువంటి వినూత్న కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశం రాష్ట్రంలో మహిళల ఆర్థిక సాధికారత, గ్రామీణ పారిశ్రామిక అభివృద్ధి, అలాగే "ఒక కుటుంబం -- ఒక పారిశ్రామికవేత్త" లక్ష్య సాధన దిశగా కీలక ముందడుగుగా నిలిచిందని అధికారులు తెలిపారు.

# సైకిళ్ల పండుగకు సర్వం సిద్ధం

## నేడు 7 వేల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు



నెల్లూరు( సింధూర దర్శిని) 26 జూలై నెల్లూరు జిల్లా ; ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత సైకిల్ల పంపిణీ కోసం నిర్వహిస్తున్న "సైకిళ్ల పండుగ"కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నెల్లూరులోని వి.ఆర్. మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నేడు సాయంత్రం జరిగే ఈ కార్యక్రమంలో తొలి విడతగా 8,9,10 తరగతులు చదువుతున్న సుమారు 7 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత సైకిళ్లను అందజేయనున్నారు. కార్యక్రమ ఏర్పాట్లను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తన సతీమణి పొంగూరు రమాదేవి, కుమార్తె శరణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. ఏర్పాట్లను పరిశీలించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చినట్లు తెలిపారు. మనవల్ల కార్యక్రమం గురించి అడగగానే ఇది "సైకిళ్ల పండుగ" అని వివరించినట్లు చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రాకపోకల భారం తగ్గించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నాణ్యమైన హీరో కంపెనీ సైకిళ్లను ప్రత్యేకంగా తయారు చేయించి పంపిణీ చేస్తున్నామని చెప్పారు. చిన్నప్పుడు చదువుకోవడానికి ఎదురైన ఇబ్బందులు నేటి విద్యార్థులు ఎదుర్కోకూడదనే ఆలోచనతో నారాయణ సార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు.నేడు సాయంత్రం 4 గంటలకు వి.ఆర్. మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఉచిత సైకిళ్లను పంపిణీ చేయనున్నారు.

# నేడు మీకోసం-ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు( సింధూర దర్శిని) 26 జూలై నెల్లూరు జిల్లా ; ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ మీకోసంఏపీ.జీఓవి.ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించిన సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం "సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్" ను అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు చేసిన ఫిర్యాదుల పరిష్కారంపై వారి అభిప్రాయాలను నేరుగా సేకరించి, పరిష్కార నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, పౌర సేవా కేంద్రాల్లో ప్రదర్శించిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ను ఫిర్యాదుదారులు స్కాన్ చేసి తమ సమస్య పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ నమోదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణతో పాటు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ప్రదర్శనకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేయడమైనది.అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందడంతో పాటు, సమస్య పరిష్కారమైన అనంతరం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను నమోదు చేసి ప్రజా సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# కోడిపందేల స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి



వింజమూరు (సింధూర దర్శిని) 26 జూలై నెల్లూరు జిల్లా ; జిల్లాలో చట్టవిరుద్ధంగా నిర్వహించే కోడిపందేలు, జూదం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాల మేరకు ఆదివారం వింజమూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మాధవనగర్ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు వింజమూరు పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. పక్కా సమాచారం ఆధారంగా నిర్వహించిన ఈ దాడిలో కోడిపందేల్లో పాల్గొంటున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5,300 నగదు మరియు ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసులు మాట్లాడుతూ, జిల్లాలో కోడిపందేలు, పేకాట, మట్కా, గ్యాంబ్లింగ్ మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.అలాగే ఎవరైనా కోడిపందేలు, పేకాట లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే డయల్-112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడిలో వింజమూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

◀ జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

◀ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి (సింధూర దర్శిని) 26 జూలై తిరుపతి జిల్లా ; జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసంఏపీ.జీఓవి.ఇన్ (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 27 వ తేదీన సోమవారం తిరుపతి కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన రశీదును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రశీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నియోజకవర్గ పార్టీ పరిస్థితులపై మాజీ మంత్రితో గూడూరు సమన్వయకర్త



గూడూరు( సింధూర దర్శిని) 26 జూలై నెల్లూరు జిల్లా ; మాజీ మంత్రి ,ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు,సర్వేపల్లి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్ రెడ్డి ని నెల్లూరు లోని వారి నివాసం నందు గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త బూదూరు గురవయ్య మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో ఉన్న పార్టీ పరిస్థితులను వివరించడం జరిగింది...వారితో సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య కూడ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ల చంద్రమోహన్ రెడ్డి, ఇందుకూరు జనార్ధన్ రెడ్డి, మనుబోలు కిష్టయ్య,రమేష్,విద్య సాగర్ కొట్టు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు





గూడూరు( సింధూర దర్శిని) 26 జూలై నెల్లూరు జిల్లా ; చిల్లకూరు మండల పరిధిలోని తూర్పు కనుపూర్ గ్రామంలో స్వయంభుగా వెలసి నిత్యం పూజలు అందుకుంటున్న ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానము నందు ఆదివారం ముత్యాలమ్మ అమ్మవారికి ఆలయ ఈవో కొమ్మలపూడి నవీన్ కుమార్ , ఆలయ చైర్మన్ చిల్లకూరు దశరథరామిరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో జిల్లా నలుమూలల నుండి తరలి రావడంతో ఆలయ ప్రాంగణం అంతా సందడి వాతావరణం నెలకొంది.

# కార్పొరేట్ల ఊడిగం.. సామాన్యుడిపై మోత !

◀ దేశంలో బిజెపి అగ్నిగుండం...
సీమకు బాబు ద్రోహం !
◀ పాలనా వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే
మతచిచ్చు !




బనగానపల్లె (సింధూర దర్శిని) 26 జూలై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీవ్ర ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఐ పోరుబాట పట్టింది. ఈ ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలను ఎండగడుతూ ఆగస్టు 6వ తేదీ నుండి 15వ తేదీ వరకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామం, మండలంలో విస్తృత ప్రచారం, పోరాటాలు నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని శ్రీ మాంటిస్సోరి స్కూల్ ఆవరణలో సిపిఐ బనగానపల్లె మండల కార్యదర్శి శివయ్య అధ్యక్షతన సిపిఐ నంద్యాల జిల్లా జనరల్ బాడీ సమావేశం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గౌరవాధ్యక్షులు పి. రామచంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు తదితరులు హాజరై ప్రసంగించారు.

◀ సమావేశం ప్రారంభానికి ముందు సిపిఐ సీనియర్ నాయకులు స్వర్గీయ ఎర్రగుడి రామన్న చిత్రపటానికి గుజ్జుల ఈశ్వరయ్యతో పాటు ముఖ్య నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంలో భాగంగా ఇటీవల మరణించిన తమిళనాడు సిపిఐ అగ్రనేత నల్లకన్ను, విశాఖ ప్రమాద బాధితులు, నీట్ పేపర్ లీకేజీ వల్ల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సభ రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించింది.

◀ ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య బిజెపి, కూటమి ప్రభుత్వాలపై నిప్పులు చెరిగారు. గత 12 ఏళ్లుగా దేశాన్ని పరిపాలిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ఒక్క ప్రెస్ మీట్ కూడా పెట్టకుండా అత్యంత నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత 45 రోజులుగా విద్యార్థి లోకం చేసిన పోరాటం యావత్ దేశాన్ని కదిలించిందన్నారు. బిజెపి హయాంలో ఇప్పటివరకు ఏకంగా 152 సార్లు పోటీ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని, ఇటీవల నీట్ పేపర్ లీకేజీల వల్ల 20 మంది విద్యార్థులు బలవన్మరణానికి గురైనా పాలకుల్లో జవాబుదారీతనం లేకపోవడం దురదృష్టకరమన్నారు.

గతంలో సాగు చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి 750 మంది రైతులు ప్రాణాలు కోల్పోయినా మోడీలో చలనం రాలేదని, లక్నోపూర్ లో మంత్రి కుమారుడు వాహనంతో రైతులను తొక్కి చంపినా కనీసం ఖండించకపోవడం వారి క్రూరత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. దేశంలో బిజెపి పాలనలో 1.42 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ లో 79 రోజుల పాటు మారణహోమం జరిగి మహిళలను వివస్త్రలను చేసినా ప్రధాని స్పందించలేదని, గిరిజనులు, దళితులు, మైనారిటీలపై దాడులు నానాటికీ తీవ్రమవుతున్నాయన్నారు. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదును కూల్చి నిర్మించిన అయోధ్య రామమందిర నిర్మాణ నిధుల్లో రూ.200 కోట్లు మాయమయ్యాయని, దీనిపై మోడీ, అమిత్ షా, యోగిలు ప్రజలకు ఏం సమాధానం చెప్తారని నిలదీశారు. సుగాలి ప్రీతి కేసు విచారణ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

◀ స్వాతంత్ర్య పోరాటంలో ఏనాడూ పాల్గొనని ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు నేడు మతాల మధ్య చిచ్చులు పెడుతూ దేశాన్ని నిరంకుశంగా పరిపాలిస్తున్నాయని దుయ్యబట్టారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో నైజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడి 4,500 మంది ప్రాణాల త్యాగంతో 10 వేల గ్రామాలకు విముక్తి కల్పించి, పేదలకు 10 వేల ఎకరాల భూములను పంచిన ఘనమైన చరిత్ర సిపిఐదేనని స్పష్టం చేశారు. దేశంలో సిపిఐ నాయకత్వంలోనే మూడో ప్రత్యామ్నాయం ఏర్పడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు.

◀ ప్రజా సమస్యలను, తమ పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే బిజెపి మతచిచ్చు పెడుతోందని మండిపడ్డారు. 2014లో రూ.400 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1100కి చేరిందని, రూపాయి విలువ పడిపోతుంటే విదేశీ దిగుమతులను ప్రోత్సహిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు, లోకేష్ లు ప్రజలను పొదుపు చేయమని చెబుతూ, తాము మాత్రం పన్నుల సొమ్ముతో జలసాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి, పోలవరం తప్ప చంద్రబాబుకు రాయలసీమ ప్రాజెక్టులు పట్టడం లేదని, సీమను గాలికి వదిలేసి మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు.

◀ సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. రామాంజనేయులు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అన్యాయాలను ప్రశ్నించలేని స్థితిలో వైసిపి ఉందన్నారు. 18 నుండి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీని చంద్రబాబు ఎందుకు అమల్లోకి తేలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై దాడులు జరుగుతున్నా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మౌనంగా ఉండటం విచారకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గౌరవాధ్యక్షులు పి. రామచంద్రయ్య మాట్లాడుతూ, స్వామినాథన్ కమిషన్ ప్రకారం రుణమాఫీ చేయకుండా కార్పొరేట్ శక్తులకు వేల కోట్లు మాఫీ చేస్తూ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నారని ఆరోపించారు. సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు మాట్లాడుతూ, జిల్లాలోని ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను గాలికి వదిలేసి తమ అనుచరుల స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ పార్టీ ప్రజల గొంతుకగా బలంగా వినిపించేలా శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

◀ ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు రఘు రాం మూర్తి, సుంకయ్య, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు బనగానపల్లె సిపిఐ నాయకులు సుబ్బారెడ్డి సంజీవులు శివ నాగయ్య ఎర్రి స్వామి బాలకృష్ణ కార్యకర్తలు పార్టీ సానుభూతిపరులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గణనాధుని దర్శించుకున్న సినీ నటుడు

కాణిపాకం (సింధూర దర్శిని) 26 జూలై చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖ సినీ నటుడు బెల్లంకొండ శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన దేవస్థానం ఛైర్మన్ మణి నాయుడు ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండపాణి, తదితరులు పాల్గొన్నారు.

## నిత్య అన్నదానం ట్రస్ట్ కి లక్ష విరాళం



కాణిపాకం ( సింధూర దర్శిని) 26 జూలై చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి నిత్య అన్నదానం ట్రస్ట్ కి విరాళం – 1,00,000/– రూపాయలు, (చెక్కు) దాత – ప్రేమ్ కుమార్ వారి కుటుంబ సభ్యులు తిరుపతి వాస్తవ్యులు, వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఉద్యమిస్తే..! ఏ ప్రభుత్వమైనా..! కూలిపోతుంది

### సిపిఐ జాతీయ నాయకులు నారాయణ వెల్లడి



గూడూరు (సింధూర దర్శిని) 26 జూలై నెల్లూరు జిల్లా ; యువత ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చిందని రాబోయే రోజుల్లో రాజకీయాల్లో పెను మార్పులు జరుగుతాయని కేంద్ర ప్రభుత్వ పాలన పై ప్రజలు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారని సిపిఐ జాతీయ నాయకులు నారాయణ వెల్లడించారు. గూడూరు పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో నారాయణ పాల్గొని మాట్లాడారు . గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో సిపిఐ జాతీయ నాయకులు నారాయణ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయాల్లో రాబోయే రోజుల పెను మార్పులు జరుగుతాయని నీట్ పరీక్ష లీకేజీ పై సుప్రీంకోర్టు జడ్జ్ వ్యాఖ్యలపై యువత తీవ్ర మనస్తాపం చెంది నిరసన చేపట్టారని, యువత నిరసనకు కేంద్ర ప్రభుత్వం తలవంచిందని విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని గుర్తు చేశారు. ఈ ఉద్యమం ఇలాగే కొనసాగి ఉంటే ప్రధానమంత్రి కూడా రాజీనామా చేయవలసి వచ్చి ఉండేదని అన్నారు. ప్రజలు ఉద్యమిస్తే ఏ ప్రభుత్వమైనా కూలిపో తుందని న్యాయవ్యవస్థపై కూడా ప్రజల్లో నమ్మకం పోయిందని మోడీ తీసుకుంటున్న నిర్ణయాలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలియజేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు కుమార్, శశి, జమాల్ ,నారాయణ ,తదితరులు పాల్గొన్నారు.

## కామన్వెల్త్ గేమ్స్: వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్‌కు రజతం.. స్నాచ్‌లో రిషికాంత రికార్డు

**స్కాట్లాండ్:** స్కాట్లాండ్ లోని గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ పతకాల ఖాతాలో మరో పతకం చేరింది. ఆదివారం జరిగిన పురుషుల 60 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో, భారత లిఫ్టర్ రిషికాంత సింగ్ చనమ్‌బామ్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. స్నాచ్ విభాగంలో సరికొత్త గేమ్స్ రికార్డు సృష్టించినప్పటికీ, ఓవరాల్‌గా రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ పోటీల్లో నాలుగో రోజు భారత్‌కు ఇదే తొలి పతకం.ఈ పోటీలో రిషికాంత స్నాచ్ విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. తొలి ప్రయత్నంలో 116 కేజీలు, రెండో ప్రయత్నంలో 119 కేజీలు ఎత్తిన అతను, మూడో ప్రయత్నంలో ఏకంగా 121 కేజీల బరువును విజయవంతంగా ఎత్తాడు. ఈ లిఫ్ట్‌తో స్నాచ్ విభాగంలో సరికొత్త కామన్వెల్త్ గేమ్స్ రికార్డును తన పేరిట లిఖించుకుని అగ్రస్థానంలో నిలిచాడు.అయితే, క్లీన్ అండ్ జర్క్ విభాగంలో పోటీ తీవ్రంగా మారింది. తొలి ప్రయత్నంలో 143 కేజీలు ఎత్తి పతక రేసులో ముందంజలో ఉన్న రిషికాంత, స్వర్ణం లక్ష్యంగా రెండో ప్రయత్నంలో 148 కేజీలు, మూడో ప్రయత్నంలో 151 కేజీలు ఎత్తడంలో విఫలమయ్యాడు. చివరి ప్రయత్నంలో బరువును భుజాల పైకి తెచ్చినప్పటికీ, జర్క్‌ను పూర్తి చేయలేకపోవడంతో మొత్తం 264 కేజీల బరువుతో తన ప్రస్థానాన్ని ముగించాడు.ఇదే అదునుగా భావించిన మలేషియా లిఫ్టర్ బిన్ కస్దాన్ మహ్మద్ అనీక్, క్లీన్ అండ్ జర్క్‌లో అద్భుతంగా రాణించి మొత్తం 273 కేజీలతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఇది కూడా ఓవరాల్‌గా కొత్త కామన్వెల్త్ గేమ్స్ రికార్డు కావడం విశేషం. కెన్యాకు చెందిన జాషువా అముంగా బోయా 260 కేజీలతో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. స్వర్ణ పతకాన్ని త్రుటిలో చేజార్చుకున్నప్పటికీ, రిషికాంత తన ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు.

# ప్రభాకర్ మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు

## ప్రభాకర్ సంతాప సభలో సిపిఐ జాతీయ నాయకులు నారాయణ వెల్లడి




గూడూరు( సింధూర దర్శిని) 26 జూలై నెల్లూరు జిల్లా ; పేద ప్రజల సమస్యలపై ప్రభాకర్ ఎప్పుడు పోరాటం చేసే వారిని అనేక సంవత్సరాలుగా పలు పోరాటాలలో ప్రభాకర్ ఎంతో చురుగ్గా ఉండేవారని, సిపిఐ జాతీయ నాయకులు నారాయణ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో సిపిఐ రాష్ట్ర నాయకులు సిహెచ్ ప్రభాకర్ సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ నాయకులు నారాయణ విచ్చేసి ప్రభాకర్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ప్రభాకర్ మృతికి సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సంతాప సభలో నారాయణ మాట్లాడుతూ నిరంతరం పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభాకర్ అనేక కార్యాలయాలు చుట్టూ తిరుగుతూ వారి సమస్యలు పరిష్కరించే వారని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఎన్నో పోరాటాలలో పాల్గొన్నారు. ప్రభాకర్ మరణం సిపిఐ పార్టీకి తీరని లోటని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని పార్టీ వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఇంకా పలు పార్టీల నాయకులు ప్రజాసంఘాల వారు ప్రభాకర్ తో ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు. ఈ సమావేశంలో ఎల్లసిరి గోపాల్ రెడ్డి ,నారా గోపాల్ ,శశి, ముని గిరీష్, వేగూరు రాజేంద్ర ,సురేష్ ,దశరథరామిరెడ్డి ,భాస్కర్ గౌడ్ ,చంద్రశేఖర్ ,తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణ లక్ష్యంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



గూడూరు( సింధూర దర్శిని) 26 జూలై నెల్లూరు జిల్లా ; చిల్లకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ జిల్లా ఎస్ పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం చిల్లకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కడివేడు గ్రామంలో విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌ను గూడూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించగా, చిల్లకూరు సబ్ ఇన్‌స్పెక్టర్ మరియు 20 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం విస్తృత తనిఖీలు చేపట్టింది.ఆపరేషన్ సందర్భంగా సుమారు 125 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేరాల నియంత్రణ లక్ష్యంగా ప్రశాంతంగా నిర్వహించబడింది. ఆపరేషన్ అనంతరం స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించి మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు, రోడ్డు భద్రత, ఆస్తి సంబంధిత నేరాల నివారణ, మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత, ఆపరేషన్ చిన్నారి చిట్టితల్లి, అత్యవసర సేవల వినియోగం తదితర అంశాలపై పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పించారు.అదేవిధంగా, తమ ప్రాంతాల్లో సంచరించే అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని, శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం నిర్వహించబడుతున్నాయని పోలీసులు తెలిపారు.

# యూపీలో పొత్తుకు సిద్ధం.. అఖిలేశ్‌కు అసదుద్దీన్ ఓవైసీ ఓపెన్ ఆఫర్



- యూపీలో బీజేపీని ఓడించేందుకు ఎస్పీతో పొత్తుకు సిద్ధమన్న అసదుద్దీన్ ఓవైసీ
- ఇప్పుడే చర్చలకు సరైన సమయం, ఎన్నికల తర్వాత బాధపడొద్దని అఖిలేశ్‌కు సూచన
- గౌరవం, న్యాయం కోసమే తమ పోరాటమని, సమానత్వంతోనే పొత్తు ఉంటుందన్న ఓవైసీ
- ఇది ఓటు బ్యాంకు రాజకీయాల కలయిక అంటూ బీజేపీ విమర్శలు

హైదరాబాద్, (సింధూర దర్శిని) 26 జూలై దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో మరోసారి రాజకీయ సమీకరణాలు వేడెక్కుతున్నాయి. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్‌కు పొత్తు కోసం బహిరంగ ఆహ్వానం పంపారు. బీజేపీని మరోసారి అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు కలిసి పనిచేయడానికి ఇదే సరైన సమయమని ఆయన స్పష్టం చేశారు.మొరాదాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఓవైసీ మాట్లాడుతూ.. "ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని మజ్లిస్ కోరుకోవడం లేదు. అందుకే నేను చేతులు కలపడానికి, పొత్తు పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాను.మాట్లాడటానికి ఇదే సరైన సమయం. ఎన్నికలు ముగిశాక తర్వాత ఏడవద్దు" అంటూ అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తమ పార్టీ పోటీ చేయడం వల్ల ఎస్పీకి నష్టం జరుగుతుందనే వాదనను ప్రస్తావిస్తూ, ఆ నష్టం జరగకుండా ఉండేందుకే తాను పొత్తుకు సిద్ధంగా ఉన్నానని వివరించారు. అయితే, ఈ పొత్తులో తమకు సమాన గౌరవం, హక్కులు కావాలని ఓవైసీ స్పష్టమైన సంకేతాలిచ్చారు. "మా పోరాటం ఏ మతానికి వ్యతిరేకం కాదు. మా గౌరవం, న్యాయం కోసమే ఈ పోరాటం. అఖిలేశ్ యాదవ్ కుర్చీలో కూర్చుంటే, నేను కూడా ఆయన ముందు సమానంగా కూర్చుని హక్కులు, న్యాయం గురించి చర్చిస్తాను" అని ఆయన పేర్కొన్నారు.ఓవైసీ పొత్తు ప్రతిపాదనపై బీజేపీ వెంటనే స్పందించింది. ఇది బుజ్జగింపు రాజకీయాల కలయిక అని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. "అఖిలేశ్, ఓవైసీ ఇద్దరూ బుజ్జగింపు రాజకీయాల్లో ఒకరితో ఒకరు పోటీ పడతారు. ఇప్పుడు 'పెద్ద భాయిజాన్ ఎవరు' అనే పోటీని పక్కనపెట్టి 'భాయిజాన్ కలయిక' కోసం చూస్తున్నారు. అందుకే ఓవైసీ, అఖిలేశ్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు" అని ఆయన ఎద్దేవా చేశారు. కాగా, యూపీలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా సమాజ్‌వాదీ పార్టీ ఉంది. 2027 ఎన్నికలను పార్లమెంట్ ఎన్నికలకు సెమీ ఫైనల్‌గా భావిస్తున్న తరుణంలో ఓవైసీ ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ ఆఫర్‌పై అఖిలేశ్ యాదవ్ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

# కాపు వర్గాలు ఎటువైపు మొగ్గుచూపితే అటు వైపే అధికారం

విజయవాడ, (సింధూర దర్శిని) 26 జూలై: రాష్ట్ర జనాభాలో కోటి మందికి పైగా ఉన్న కాపు, బలిజ, తూర్పు కాపు సామాజికవర్గాలు ఏ పార్టీ వైపు మొగ్గుచూపితే ఆ పార్టీనే అధికారంలోకి వస్తుందని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అభిప్రాయపడ్డారు. గుంటూరులో రాష్ట్ర కాపు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముద్రగడ సంస్మరణ సభలో ఆయన పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు.మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నేతృత్వంలో సాగిన కాపు ఉద్యమం కారణంగానే 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారానికి దూరమైందని ఆయన పేర్కొన్నారు. నాడు జరిగిన కొన్ని వ్యతిరేక ప్రచారాల వల్ల ముద్రగడ ప్రారంభించిన ఉద్యమం టీడీపీ ఓటమికి దారితీసిందని విశ్లేషించారు. రాష్ట్ర జనాభాలో 25 శాతం ఉన్న కాపులకు జనాభా దామాషా ప్రకారం నిధులు, పదవులు కేటాయించాలన్నది సమంజసమైన ఆకాంక్ష అని, వారిలో ఉన్న అసంతృప్తిని ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. త్వరలోనే విజయవాడలో ముద్రగడ పద్మనాభం విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.ఇదే కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. ముద్రగడ మాటకు కట్టుబడే వ్యక్తి అని కొనియాడారు. ఇచ్చిన మాట కోసం తన పేరునే మార్చుకున్న గొప్ప వ్యక్తి అని ఆయన గుర్తుచే శారు. ఒకే సామా జికవర్గానికి చెందిన ఇద్దరు ప్రత్యర్థి పార్టీల నేతలు బొండా ఉమ, అంబటి రాంబాబు ఒకే వేదికపై పక్కపక్కనే కూర్చొని ఆప్యాయంగా మాట్లాడుకున్నారు.

# నటుడు రమేశ్ కుటుంబానికి చిరంజీవి అండ

- కుటుంబ సభ్యులకు చెక్ అందజేత
- బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చేరిన 'గబ్బర్ సింగ్' నటుడు రమేశ్
- ఆయన కుటుంబానికి రూ. 3 లక్షలు అందించిన చిరంజీవి
- రూ. 2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన నాగబాబు
- రమేశ్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన హరీశ్ శంకర్, పవన్ టీం



హైదరాబాద్, (సింధూర దర్శిని) 26 జూలై మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నటుడు రమేశ్ కుటుంబానికి ఆయన అండగా నిలిచారు. చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు.'గబ్బర్ సింగ్' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న నటుడు రమేశ్, ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో అపోలో ఆసుపత్రిలోని ఐసీయూలో చేరారు. ఈ విషయం తెలియగానే దర్శకుడు హరీశ్ శంకర్, పవన్ కల్యాణ్ టీం సభ్యులు ఆసుపత్రికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి ద్వారా విషయం తెలుసుకున్న చిరంజీవి వెంటనే స్పందించారు. అపోలో ఆసుపత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి రమేశ్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు.అనంతరం రమేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన భార్యకు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం ద్వారా కూడా సహాయం అందేలా చూస్తానని చిరంజీవి హామీ ఇచ్చారు. రమేశ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు మెగా బ్రదర్ నాగబాబు సైతం తన వంతుగా రూ.2 లక్షల చెక్కును అందించి కుటుంబానికి భరోసా ఇచ్చారు. కష్టాల్లో ఉన్న తోటి కళాకారులకు మెగా కుటుంబం అండగా నిలవడంపై సినీ వర్గాల నుంచి, ప్రజల నుంచి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# వైభవ్ మళ్లీ కొట్టాడు.. చివరి టీ20లో టీమిండియా భారీ స్కోరు

**జింబాబ్వేతో మూడో టీ20**



యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అద్భుత ఇన్నింగ్స్ కేవలం 49 బంతుల్లో 81 పరుగులు చేసిన సూర్యవంశీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 192 పరుగులు చేసిన భారత్ రాణించిన ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, రింకూ సింగ్ జింబాబ్వేతో జరుగుతున్న మూడో టీ20 మ్యాచ్‌లో భారత జట్టు భారీ స్కోరు సాధించింది. ఫామ్ లో ఉన్న యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (81) మరోసారి అర్ధశతకంతో చెలరేగడంతో, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. దీంతో జింబాబ్వే ముందు 193 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే అభిషేక్ శర్మ (2) వికెట్ రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. అయితే, మరో ఎండ్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుతంగా ఆడాడు. కేవలం 49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 81 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. ఈ యువ బ్యాటర్ ఎక్కడా తొందరపడకుండా, తన షాట్ సెలక్షన్‌లో గొప్ప పరిణతి కనబరిచాడు. బంతి షార్ట్ లెంగ్త్ పడితే మాత్రం తన బలంతో బౌండరీ లైన్ దాటించాడు. జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా బౌలింగ్ లో సూర్యవంశీ కొట్టిన ఓ భారీ సిక్స్ స్టేడియం దాటింది. సూర్యవంశీకి ఇషాన్ కిషన్ (29), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (27) నుంచి మంచి సహకారం లభించింది. చివర్లో రింకూ సింగ్ (14 బంతుల్లో 25) తనదైన శైలిలో మెరుపులు మెరిపించడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. తిలక్ వర్మ 11 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవాన్స్ రెండు వికెట్లు పడగొట్టగా, కెప్టెన్ సికందర్ రజా, బ్లెస్సింగ్ ముజరబానీ, వెస్లీ మధెవెరే తలో వికెట్ తీశారు. ఈ పిచ్‌పై 193 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం జింబాబ్వేకు సవాలుతో కూడుకున్నదేనని విశ్లేషకులు భావిస్తున్నారు.ఇప్పటికే ఈ మూడు మ్యాచ్ ల సిరీస్ ను టీమిండియా 2–0తో చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. నేటి మ్యాచ్ ను కూడా గెలిచి సిరీస్ క్లీన్ స్వీప్ చేయాలని భారత్ భావిస్తోంది.



# కార్గిల్ వీరులకు చంద్రబాబు, పవన్ నివాళి.. త్యాగాలను స్మరించుకున్న నేతలు

- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు నివాళులు
- సైనికుల త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమన్న చంద్రబాబు
- కార్గిల్ విజయం భారత స్ఫూర్తికి ప్రతీక అన్న పవన్ కల్యాణ్

అమరావతి, (సింధూర దర్శిని) 26 జూలై కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రాణత్యాగం చేసిన సైనికుల అసమాన ధైర్యసాహసాలను, త్యాగాలను వారు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ మేరకు ఇరువురు నేతలు సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తమ సందేశాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందిస్తూ.. "అసాధారణ ధైర్యసాహసాలతో దేశానికి ఘన విజయాన్ని అందించిన యోధులకు నివాళులు అర్పిస్తున్నాను. అత్యంత దుర్భేద్యమైన భూభాగం, ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడారు. వారి అత్యున్నత త్యాగం, అసమాన పరాక్రమం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఇది భారతీయ దేశభక్తికి, జాతీయ గర్వానికి శాశ్వత ప్రతీకగా మిగిలిపోతుంది" అని పేర్కొన్నారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సందేశంలో పేర్కొంటూ.. "అసాధారణ శౌర్యంతో, నిస్వార్థ త్యాగంతో త్రివర్ణ పతాక గౌరవాన్ని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడిన అమరవీరులకు వినమ్ర నివాళులు. కార్గిల్ కేవలం ఒక యుద్ధ విజయం మాత్రమే కాదు.. అది అజేయమైన ధైర్యానికి, భారతదేశ అచంచల స్ఫూర్తికి నిదర్శనం. మన పవిత్ర మాతృభూమిలోని ప్రతి అంగుళాన్ని మన సైనిక యోధులు ప్రాణాలకు తెగించి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. వారి త్యాగాల పునాదిపైనే మనం నేడు ప్రశాంతంగా జీవిస్తున్నాం" అని తెలిపారు.

# ప్రైవేట్ కంపెనీలపై హెచ్‌ఆర్‌సీకి అధికారం లేదు: తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు



హైదరాబాద్, (సింధూర దర్శిని) 26 జూలై ప్రైవేట్ కంపెనీలు, వాటి ఉద్యోగులపై వచ్చే ఫిర్యాదులను విచారించే అధికారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు (హెచ్‌ఆర్‌సీ) లేదని తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. హెచ్‌ఆర్‌సీ పరిధి కేవలం ప్రభుత్వ ఉద్యోగులు, వారి నిర్లక్ష్యానికి సంబంధించిన అంశాలకే పరిమితమని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.వెల్స్ ఫార్గో ఇంటర్నేషనల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉద్యోగులు, తమకు పనిప్రదేశంలో వేధింపులు ఎదురయ్యాయని ఆరోపిస్తూ హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించారు. దీనిపై హెచ్‌ఆర్‌సీ జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ సదరు సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఉద్యోగ వివాదాలు, పనితీరు మదింపు వంటివి యజమాని, ఉద్యోగుల మధ్య ఉండే అంతర్గత వ్యవహారాలని ధర్మాసనం పేర్కొంది. ఇటువంటి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ప్రత్యేక చట్టపరమైన వేదికలు ఉన్నాయని తెలిపింది. ఆరోపణల తీవ్రతను బట్టి హెచ్‌ఆర్‌సీ తన అధికార పరిధిని విస్తరించుకోలేదని అభిప్రాయపడింది.

ముఖ్యంగా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల వంటి ఫిర్యాదులకు 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్ చట్టం)' సరైన మార్గమని ధర్మాసనం సూచించింది. బాధితులు ఆ చట్టం కింద ఏర్పాటైన అంతర్గత కమిటీలను ఆశ్రయించాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, హెచ్‌ఆర్‌సీ ముందు పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను కొట్టివేస్తూ, కంపెనీ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. అయితే, బాధితులు ఇతర చట్టాల ద్వారా న్యాయం పొందేందుకు స్వేచ్ఛ ఉందని తీర్పులో పేర్కొంది.

# భోగాపురం ఎయిర్ పోర్టులో ఆగస్టు 17 నుంచి విమానాల రాకపోకలు!

- ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా విమానాశ్రయం ప్రారంభోత్సవం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధికారిక ప్రకటన



విశాఖపట్నం (సింధూర దర్శిని) 26 జూలై విశాఖపట్నం సమీపంలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో వాణిజ్య కార్యకలాపాలు ఆగస్టు 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. అంతకుముందు, ఆగస్టు 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విమానాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పల్లా శ్రీనివాసరావు ఈ వివరాలను వెల్లడించారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలకడంతో పాటు, భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 2 లక్షల మంది ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు ఆయన వివరించారు.



## కేంద్రమంత్రి రాజీనామా.. అన్నా హజారే కీలక వ్యాఖ్యలు

- ఇది ప్రజాస్వామ్యం, నియంతృత్వం కాదన్న అన్నా హజారే
- సమస్యల పరిష్కారానికి చర్చల మార్గమే సరైందని సూచన
- నిరసనలు, ఆందోళనలు శాంతియుతంగా జరగాలని పిలుపు
- ప్రజాస్వామ్య విలువల ప్రాముఖ్యతను గుర్తుచేసిన హజారే

**ఢిల్లీ:** ప్రముఖ సామాజిక కార్యకర్త, గాంధేయవాది అన్నా హజారే దేశంలో నిరసనలు, ప్రజాస్వామ్య విలువలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) తన నిరసనను విరమించుకున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. సమస్యలను బలప్రయోగంతో కాకుండా చర్చలు, ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఇది ప్రజాస్వామ్యమని, నియంతృత్వం కాదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. అహిల్యానగర్‌లో విలేకరులతో మాట్లాడిన 89 ఏళ్ల హజారే.. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకూడదని అన్నారు. "ఇది ప్రజాస్వామ్యం, నియంతృత్వం కాదు. ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య మార్గాన్నే అనుసరించాలి" అని ఆయన పేర్కొన్నారు. ప్రజలు, ప్రభుత్వాలు ఘర్షణ వైఖరిని వీడి, చర్చల మార్గాన్ని ఎంచుకున్నప్పుడే వ్యవస్థలో అర్థవంతమైన, శాశ్వతమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా పరీక్షా విధానాలపై విశ్వాసాన్ని దెబ్బతీసిన పేపర్ లీకేజీల వ్యవహారంపై సీజేపీ వారాల తరబడి నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఆందోళనల నేపథ్యంలో నిన్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో సీజేపీ తమ ఆందోళనను విరమించుకుంది. ఈ పరిణామం జరిగిన మరుసటి రోజే అన్నా హజారే స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఆసుపత్రి బెడ్‌పై వైఎస్ షర్మిల.. సర్జరీపై స్పష్టతనిచ్చిన ఏపీ కాంగ్రెస్ చీఫ్


- ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు శస్త్రచికిత్స
- పొత్తికడుపుకు ఆపరేషన్ జరిగిందని స్వయంగా వెల్లడి
- ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నానని 'ఎక్స్' వేదికగా పోస్ట్
- ఆందోళన చెందవద్దని పార్టీ కార్యకర్తలు, అభిమానులకు సూచన
- సర్జరీ కారణంగానే ఇటీవల రాజకీయ కార్యక్రమాలకు దూరం



అమరావతి, (సింధూర దర్శిని) 26 జూలై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆసుపత్రి బెడ్‌పై చికిత్స పొందుతున్న ఆమె ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమె ఆరోగ్య పరిస్థితిపై పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ ఊహాగానాలకు తెరదించుతూ, తన ఆరోగ్య పరిస్థితిపై షర్మిల స్వయంగా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పష్టత ఇచ్చారు. తనకు పొత్తికడుపుకు సంబంధించిన ఒక సాధారణ ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నానని తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక పోస్ట్ చేస్తూ.. "ఇటీవల నాకు పొత్తికడుపు ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం నేను బాగున్నాను, చాలా వేగంగా కోలుకుంటున్నాను. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ సమయంలో నా కోసం ప్రార్థనలు చేసిన వారికి, ధైర్యం చెప్పిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీ ప్రేమ, ఆదరణ, ఆశీస్సులు నాకు ఎంతో బలాన్నిచ్చాయి" అని పేర్కొన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె భరోసా ఇచ్చారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి షర్మిల రాష్ట్ర రాజకీయాల్లో చాలా చురుగ్గా ఉంటున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు చేస్తూ తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. అయితే, గత కొంతకాలంగా ఆమె ప్రత్యక్ష రాజకీయ కార్యక్రమాల్లో కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా 'నీట్' పేపర్ లీక్ వ్యవహారంపై నిరసనలు జరుగుతున్న సమయంలో ఆమె గైర్హాజరుపై పలువురు ప్రశ్నించారు. అయితే, ఆ సమయంలో ఆమె ట్విట్టర్ ద్వారా స్పందిస్తూనే ఉన్నారు. తాజాగా ఆమెకు సర్జరీ జరగడమే ఈ విరామానికి కారణమని స్పష్టమైంది. షర్మిల ఏపీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన తర్వాత పార్టీకి కొత్త ఉత్సాహం వచ్చిందని, కార్యకర్తల్లో జోష్ పెరిగిందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారని, త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి, రాజకీయ కార్యక్రమాల్లోకి వస్తారని పార్టీ వర్గాలు, అభిమానులు ఆశిస్తున్నారు.

# సన్‌ఫిష్‌ను ఢీకొట్టి పేల్చేసిన కిల్లర్ వేల్.. కెమెరాకు చిక్కిన అరుదైన వేట!

**మెక్సికో:** కిల్లర్ వేల్స్ సరికొత్త వేట పద్ధతి వెలుగులోకి భారీ ఓషన్ సన్‌ఫిష్‌ను ఢీకొట్టి ముక్కలు చేస్తున్న ఓర్కా మెక్సికో సముద్ర తీరంలో ఈ అరుదైన దృశ్యం రికార్డ్ చిన్న ఓర్కాలు కూడా తినేందుకు వీలుగా ఈ వ్యూహం ఓర్కాల అద్భుత తెలివితేటలకు ఇది నిదర్శనమంటున్న శాస్త్రవేత్తలు సముద్ర జీవుల్లో అత్యంత తెలివైనవిగా పేరున్న కిల్లర్ వేల్స్ (ఓర్కాలు)కు సంబంధించిన ఓ అద్భుతమైన దృశ్యం కెమెరాకు చిక్కింది. మెక్సికోలోని గల్ఫ్ ఆఫ్ కాలిఫోర్నియాలో ఓ భారీ ఓషన్ సన్‌ఫిష్‌ను ఒక ఓర్కా అత్యంత వేగంగా ఢీకొట్టి, వేల ముక్కలుగా పేల్చివేసింది. ఈ అసాధారణ వేట పద్ధతిని సముద్ర జీవశాస్త్రవేత్తలు తొలిసారిగా వీడియోలో బంధించారు. 'బినీత్ ది వేవ్స్' అనే సంస్థకు చెందిన మెరైన్ బయాలజిస్ట్ డాక్టర్ క్యాథరిన్ ఐర్స్ ఈ అరుదైన ఫుటేజ్‌ను రికార్డ్ చేశారు. ఇందులో ఒక ఆడ ఓర్కా చనిపోయిన సన్‌ఫిష్ తోకను పట్టుకుని ఉండగా, మరో మగ ఓర్కా దానివైపు అత్యంత వేగంగా దూసుకువచ్చింది. ఢీకొట్టడానికి కొద్ది క్షణాల ముందు ఆడ ఓర్కా చేపను వదిలేయగా, మగ ఓర్కా దాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ తాకిడికి ఆ భారీ చేప వేల ముక్కలుగా చిన్నాభిన్నమైంది. అనంతరం ఆ ముక్కలను



ఓర్కా గుంపులోని చేపలన్నీ సులభంగా పంచుకు తిన్నాయి. ఓ చిన్న ఓర్కా కూడా ఈ ముక్కలను తినడం కనిపించింది. ఓషన్ సన్‌ఫిష్ (మోలా మోలా) దాదాపు 2000 కిలోల బరువు వరకు పెరుగుతుంది. ఇంత పెద్ద చేపను ముక్కలు చేయడం కష్టం కాబట్టి, ఓర్కాలు ఈ వ్యూహాన్ని అనుసరిస్తున్నాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 2025 సెప్టెంబర్‌లో కూడా ఇదే ప్రాంతంలో ఇలాంటి సంఘటనే రికార్డయింది. ఈ వరుస ఘటనలు ఓర్కాల సమస్య పరిష్కార సామర్థ్యాలను, సామాజిక సమన్వయంతో వేటాడే నైపుణ్యాలను తెలియజేస్తున్నాయని పరిశోధకులు వివరిస్తున్నారు.

# కావేరి సెగ.. కర్ణాటకకు నిలిచిన తమిళనాడు బస్సులు



- కన్నడ సంఘాల నిరసనల నేపథ్యంలో కర్ణాటకకు బస్సు సర్వీసులు నిలిపివేత
- హోసూరు సరిహద్దు వద్ద తమిళనాడు బస్సులను ఆపేసిన అధికారులు
- బెంగళూరు వెళ్లే ప్రయాణికులకు తప్పని తీవ్ర ఇబ్బందులు
- మేకెదాటు ప్రాజెక్టుపై కొనసాగుతున్న వివాదమే కారణం
- సరిహద్దులో భారీగా పోలీసుల మోహరింపు, భద్రత కట్టుదిట్టం

**కర్ణాటక:** కావేరి నదీ జలాల వివాదం మరోసారి రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలకు దారితీసింది. కన్నడ సంఘాలు ఆదివారం నిరసనలకు పిలుపునివ్వడంతో, ముందుజాగ్రత్త చర్యగా తమిళనాడు నుంచి కర్ణాటకకు వెళ్లే బస్సు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. హోసూరు సరిహద్దు వద్ద బస్సులను ఆపేయడంతో బెంగళూరు సహా ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమిళనాడు నుంచి బయలుదేరిన ప్రభుత్వ బస్సులను హోసూరు బస్ స్టాండ్ వద్దనే అధికారులు నిలిపివేశారు. దీంతో కర్ణాటక వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. చాలా మంది స్థానిక టౌన్ బస్సుల్లో తమిళనాడు సరిహద్దు వరకు ప్రయాణించి, అక్కడి నుంచి ఆటోరిక్షాలలో కర్ణాటకలోని అత్తిబెలెకు చేరుకున్నారు. అనంతరం వేరే బస్సులు లేదా ఇతర వాహనాల్లో బెంగళూరుకు తమ ప్రయాణాన్ని కొనసాగించారు. ఈ క్రమంలో ప్రయాణికులపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు, వారి ప్రయాణ సమయం కూడా గణనీయంగా పెరిగింది. అయితే, కర్ణాటక నుంచి తమిళనాడుకు వచ్చే బస్సుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదు. బస్సులను మాత్రమే నిలిపివేసిన అధికారులు, ప్రైవేట్ కార్లు, వాణిజ్య వాహనాలు, సరుకు రవాణా వాహనాలను మాత్రం యథావిధిగా అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు హోసూరు-అత్తిబెలె సరిహద్దు వద్ద, ఇతర సున్నితమైన ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. దశాబ్దాలుగా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య కావేరి జలాల పంపకాల వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా కావేరి నదిపై మేకెదాటు వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాలని కర్ణాటక ప్రతిపాదించడంతో ఈ వివాదం మళ్లీ రాజుకుంది. ఈ ప్రాజెక్టు వల్ల తమకు కేటాయించిన నీటి వాటాపై తీవ్ర ప్రభావం పడుతుందని, ట్రిబ్యునల్ ఆదేశాలను ఉల్లంఘించినట్లే అవుతుందని తమిళనాడు మొదటి నుంచి ఈ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రస్తుతానికి సరిహద్దు ప్రాంతంలో పరిస్థితులను అధికారులు నిశితంగా గమనిస్తూ, భద్రతను కట్టుదిట్టం చేశారు.

# బాలకృష్ణను పరామర్శించిన సీఎం చంద్రబాబు.. ఆరోగ్య పరిస్థితిపై ఆరా

- హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలకృష్ణ
- బావమరిదిని పరామర్శించిన సీఎం చంద్రబాబు నాయుడు
- బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడిన సీఎం
- గత వారం షూటింగ్‌లో మోకాలికి గాయపడటంతో శస్త్రచికిత్స
- ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపిన వైద్యులు

హైదరాబాద్, (సింధూర దర్శిని) 26 జూలై హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను సీఎం చంద్రబాబు నాయుడు ఇవాళ



పరామర్శించారు. గత వారం సినిమా షూటింగ్‌లో గాయపడిన బాలకృష్ణకు ఇటీవల మోకాలికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చంద్రబాబు.. తన బావమరిది అయిన బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన ఎంత వేగంగా కోలుకుంటున్నదీ వాకబు చేశారు. అనంతరం వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడి బాలకృష్ణకు అందిస్తున్న చికిత్స, తదుపరి పునరావాస ప్రణాళికల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21న రాజమండ్రిలో గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఓ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు బాలకృష్ణ ప్రమాదవశాత్తు గాయపడ్డారు. ఆయన ఎడమ మోకాలికి తీవ్ర గాయం కావడంతో మరుసటి రోజే ఆయన్ను ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తరలించి ఏఐజీ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల అనంతరం బాలకృష్ణ ఎడమ కాలి క్వాడ్రిసెప్స్ టెండన్ (తొడ కండరాన్ని మోకాలి చిప్పకు కలిపే కణజాలం) చిరిగిందని, మోకాలికి ఇరువైపులా ఉన్న సహాయక కణజాలాలు కూడా దెబ్బతిన్నాయని వైద్యులు నిర్ధారించారు. దీంతో ఈ నెల 23న వైద్యులు ఆయనకు విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేశారు. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ ఆపరేషన్‌లో గాయం చుట్టూ పేరుకుపోయిన రక్తాన్ని తొలగించి, చిరిగిన టెండన్‌ను మోకాలి చిప్పకు తిరిగి అతికించామని, దెబ్బతిన్న కణజాలాలకు మరమ్మతులు చేశామని ఆసుపత్రి వర్గాలు మెడికల్ బులెటిన్‌లో తెలిపాయి. ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉందని, నిపుణుల బృందం పర్యవేక్షణలో ఉన్నారని పేర్కొన్నాయి.

# నేపాల్ కొత్త రూపాయి నాణెంపై వివాదాస్పద మ్యాప్!


**నేపాల్:** భారత్‌తో సరిహద్దు వివాదం కొనసాగుతు న్నప్పటికీ, నేపాల్ మరోసారి తన పాత వైఖరినే ప్రదర్శించింది. వివాదాస్పద ప్రాంతాలైన లింపియా ధురా, లిపులేఖ్, కాలాపానీలను తమ భూభాగంలో చూపిస్తూ రూపొందించిన మ్యాప్‌తోనే నూతన రూపాయి నాణేన్ని ముద్రించాలని ఆ దేశం నిర్ణయించింది. ఈ ప్రాంతాలు తమవేనని నేపాల్ వాదిస్తుండగా, అవి ఉత్తరాఖండ్‌లో అంతర్భాగమని భారత్ స్పష్టం చేస్తోంది. వాస్తవానికి, ప్రస్తుత ప్రధాని బాలెన్ షా నేతృత్వంలోని ప్రభుత్వం ఈ వివాదాస్పద మ్యాప్‌ను నాణెం నుంచి తొలగించి, దాని



స్థానంలో ఒక మఠం చిత్రాన్ని ముద్రించాలని తొలుత భావించింది. అయితే, దేశంలోని ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత, ఒత్తిడి రావడంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. పాత మ్యాప్‌తోనే నాణేన్ని ముద్రించాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు నేపాల్ జాతీయ బ్యాంక్ అధికారి గురు ప్రసాద్ పౌడెల్ అధికారికంగా ప్రకటన చేశారు. 2020లో అప్పటి కేపీ ఓలీ శర్మ ప్రభుత్వం ఈ మూడు ప్రాంతాలను తమ దేశంలో కలుపుతూ కొత్త రాజకీయ పటాన్ని విడుదల చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఈ అంశంపై విభేదాలు కొనసాగుతున్నాయి. ఎలాంటి సమస్యనైనా ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ సూచిస్తోంది.

# భారత విద్యార్థి ఉద్యమంపై అంతర్జాతీయ మీడియా ప్రత్యేక కథనాలు

- మోదీ ప్రభుత్వానికి ఇది పెద్ద రాజకీయ సవాల్ అని పేర్కొన్న రాయిటర్స్
- చారిత్రక విద్యార్థి ఉద్యమాల్లో ఒకటిగా అభివర్ణించిన బీబీసీ
- యువతలో నిరుద్యోగం, పాలనపై అసంతృప్తే కారణమన్న సీఎన్ఎన్, అల్ జజీరా
- సెలబ్రిటీల మౌనాన్ని ప్రముఖంగా ప్రస్తావించిన ది గార్డియన్ పత్రిక



నీట్–యూజీ 2026 పేపర్ లీక్ వ్యవహారంలో మొదలైన విద్యార్థుల నిరసన, అనతికాలంలోనే పెను ఉద్యమంగా మారి అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించింది. విద్యార్థులపై లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగం, ఢిల్లీ వీధుల్లో వేలాది మంది యువత చేపట్టిన నిరసనల చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా ప్రసారమయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడంతో, ఈ ఆందోళనలను భారత పాలన, యువత ఆకాంక్షలు, రాజకీయ జవాబుదారీతనానికి సంబంధించినవిగా అంతర్జాతీయ మీడియా అభివర్ణించింది.

**ప్రపంచ మీడియా సంస్థల కథనాల్లో ఏముంది?**

**రాయిటర్స్:** ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చాక ఎదుర్కొంటున్న అతిపెద్ద రాజకీయ సవాల్ ఇదేనని రాయిటర్స్ పేర్కొంది. సాధారణంగా ప్రజా ఒత్తిళ్లకు తలొగ్గరనే పేరున్న మోదీ ప్రభుత్వంలో, మంత్రి రాజీనామా చేయడం ఆశ్చర్యకరమని విశ్లేషించింది. పరీక్షల్లో అవకతవకలతో పాటు, నిరుద్యోగం, పరిమిత అవకాశాలపై యువతలో ఉన్న ఆందోళనను ఈ నిరసనలు ప్రతిబింబిస్తున్నాయని తెలిపింది.

**సీఎన్ఎన్:** ప్రధాన్ రాజీనామాను మోదీ ప్రభుత్వానికి "అరుదైన, పెరుగుతున్న సవాల్"గా సీఎన్ఎన్ అభివర్ణించింది. ఈ ఆందోళనలు కేవలం పరీక్షల లీక్‌కు మాత్రమే పరిమితం కాలేదని, దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, పాలనలో జవాబుదారీతనంపై ఉన్న లోతైన ఆందోళనలకు ఇది నిదర్శనమని పేర్కొంది.

**బీబీసీ:** ఇటీవలి కాలంలో భారత్‌లో జరిగిన అతిపెద్ద విద్యార్థి ఉద్యమాలలో ఇది ఒకటని బీబీసీ తెలిపింది. 1970ల నాటి నవ నిర్మాణ్ ఉద్యమంతో పోలుస్తూ, కొన్ని విద్యార్థి ఉద్యమాలు రాజకీయ మార్పులకు కారణమైనప్పటికీ, మరికొన్ని కాలక్రమేణా కనుమరుగయ్యాయని గుర్తుచేసింది. "ఈ అసంతృప్తిని రాజకీయ ఉద్యమంగా ఎంతకాలం కొనసాగించగలరనేది మరో ప్రశ్న" అని వ్యాఖ్యానించింది.

**ది గార్డియన్:** ఈ పత్రిక రాజకీయ కోణంలో కాకుండా, సాంస్కృతిక స్పందనపై దృష్టి పెట్టింది. విద్యార్థులపై హింస జరుగుతున్నా భారత సినీ ప్రముఖులు, సెలబ్రిటీలు మౌనంగా ఉండటంపై నిరసనకారుల్లో వ్యక్తమైన ఆగ్రహాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. సొంత దేశంలో యువత కష్టాల్లో ఉన్నప్పుడు స్పందించని సెలబ్రిటీల తీరును నిరసనకారులు తప్పుపట్టినట్లు కథనంలో పేర్కొంది.

**ది ఇండిపెండెంట్ (బ్రిటన్):** 'లక్షలాది మంది విద్యార్థులను ప్రభావితం చేసిన పరీక్షల లీకేజీపై జవాబుదారీతనం కోరుతూ 'జెన్ z' యువత నడిపిన ఉద్యమానికి మోదీ ప్రభుత్వం ఇచ్చిన తొలి పెద్ద రాయితీ ఇది,' అని అభివర్ణించింది.

**ది గ్లోబ్ అండ్ మెయిల్ (కెనడా):** ఇటీవలి సంవత్సరాలలో మోదీ ప్రభుత్వం ఎదుర్కొన్న అత్యంత బలమైన ప్రజా ఉద్యమాలలో ఒకదానికి తలొగ్గి, ఇచ్చిన తొలి ముఖ్యమైన రాయితీ ఈ రాజీనామా అని పేర్కొంది.

**అల్ జజీరా, ఎస్‌సీఎంపీ:** మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇటీవలి కాలంలో ఇంత స్పష్టమైన ప్రజా వ్యతిరేకత కనిపించడం ఇదేనని అల్ జజీరా తెలిపింది. ఈ ఉద్యమం యూనివర్సిటీ క్యాంపస్‌లకే పరిమితం కాకుండా, పౌర సమాజం, ప్రతిపక్షాల మద్దతుతో దేశవ్యాప్తంగా విస్తరించిందని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ విశ్లేషించింది. మొత్తం మీద, ఒక్కో మీడియా సంస్థ ఒక్కో కోణంలో విశ్లేషించినప్పటికీ, ఈ ఉద్యమ తీవ్రతను, ప్రాధాన్యతను అన్నీ గుర్తించాయి. కేవలం పరీక్షల్లో అవకతవకల అంశంగా మొదలైన ఈ నిరసన, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నాటికి.. యువత భవిష్యత్తు, అవకాశాలు, పాలనపై వారికున్న విస్తృత అసంతృప్తికి ప్రతీకగా మారిందని అంతర్జాతీయ మీడియా కథనాలు స్పష్టం చేస్తున్నాయి.

# ఇక ఎన్నికల్లో పోటీ చేయను : సిద్ధరామయ్య



- 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించిన కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య
- రాజకీయాలు కలుషితం అయ్యాయని, నిజాయితీగా ఉండటం కష్టంగా మారిందని ఆవేదన
- వయసు, ఆరోగ్యం కూడా కారణాలుగా పేర్కొన్న కాంగ్రెస్ సీనియర్ నేత
- ఎన్నికల్లో పోటీ చేయకపోయినా ప్రజా జీవితంలోనే ఉంటూ సేవ చేస్తానని స్పష్టం
- గతంలోనూ పలుమార్లు ఎన్నికల రాజకీయాల నుంచి వైదొలుగుతానన్న సిద్ధరామయ్య

**కర్ణాటక:** కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య సంచలన ప్రకటన చేశారు. తాను 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోనని, ఎన్నికల రాజకీయాల నుంచి శాశ్వతంగా వైదొలుగుతున్నానని స్పష్టం చేశారు. అయితే, ప్రజా జీవితంలోనే కొనసాగుతూ ప్రజల పక్షాన తన గొంతు వినిపిస్తూనే ఉంటానని ఆయన తెలిపారు. మండ్య జిల్లాలోని కే.ఆర్. పేట పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో మద్దతుదారులను ఉద్దేశించి సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు. "రాజకీయాలు ప్రస్తుతం అత్యంత కలుషితమయ్యాయి. నిజాయతీతో కూడిన రాజకీయాలు మనుగడ సాగించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నాను" అని ఆయన అన్నారు. 2028 నాటికి తన వయసు 82 ఏళ్లకు చేరుకుంటుందని, అప్పుడు ఇప్పుడున్నంత ఉత్సాహంగా, ఆరోగ్యంగా పనిచేయలేకపోవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రకటనతో అక్కడున్న మద్దతుదారులు, కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురయ్యారు. మరో పదేళ్ల పాటు క్రియాశీల రాజకీయాల్లోనే ఉండాలని వారు సిద్ధరామయ్యను కోరారు. అయినప్పటికీ, ఆయన తన నిర్ణయానికే కట్టుబడి ఉన్నట్లు పునరుద్ఘాటించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, సిద్ధరామయ్య తన నిర్ణయాన్ని ఆదివారం 'ఎక్స్' వేదికగా మరోసారి ధ్రువీకరించారు."నేను 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకపోయినా, రాజకీయాల్లో చురుకుగా ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా ను" అని ఆయన స్పష్టం చేశారు. వరుణ నియోజకవర్గ ప్రజలు తనను మరోసారి పోటీ చేయాలని కోరుతున్నప్పటికీ, తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.గతంలో ఎన్నికల తీరును గుర్తుచేసుకుంటూ, "అప్పట్లో మేం ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పుడు నియోజకవర్గ ప్రజలే ఆర్థికంగా సహాయం చేసి గెలిపించేవారు. కానీ నేటి పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది" అని ప్రస్తుత రాజకీయాల్లో పెరిగిపోయిన ఖర్చు గురించి ఆవేదన వ్యక్తం చేశారు. 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సిద్ధరామయ్య, 2028 నాటికి ప్రజా జీవితంలో 50 ఏళ్లు పూర్తి చేసుకుంటారు. "ఈ సుదీర్ఘ ప్రయాణంలో గెలుపోటములను చూశాను. కానీ, నేను నమ్మిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా గానీ, నా అంతరాత్మకు విరుద్ధంగా గానీ ఎప్పుడూ ప్రవర్తించలేదు" అని అన్నారు. దశాబ్దాలుగా కర్ణాటక ప్రజలు తనపై చూపిన ఆదరాభిమానాలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, తన మిగిలిన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేస్తానని సిద్ధరామయ్య తెలిపారు.కాగా, సిద్ధరామయ్య రెండు పర్యాయాలుగా మొత్తం ఏనిమిదేళ్లకు పైగా కర్ణాటక ముఖ్యమంత్రిగా పనిచేసి, రాష్ట్ర చరిత్రలో ఎక్కువ కాలం సీఎం పదవిలో ఉన్న నేతగా రికార్డు సృష్టించారు. 2013 నుంచి 2018 వరకు పూర్తి ఐదేళ్ల పాటు, ఆ తర్వాత 2023 నుంచి 2026 వరకు రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన గతంలో 2013, 2018, 2024 ఎన్నికల సమయంలోనూ ఇలాంటి ప్రకటనలు చేసినప్పటికీ, తాజా వ్యాఖ్యలతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై మరోసారి చర్చ మొదలైంది.

# 'నౌల్' ప్రళయం... చైనాలో రెడ్ అలర్ట్



- దక్షిణ చైనాను తాకిన నౌల్ టైఫూన్
- గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో 7 లక్షల మందికి పైగా తరలింపు
- హాంకాంగ్‌లో వందల విమానాలు, రైలు సర్వీసులు రద్దు
- పలు ప్రావిన్సుల్లో వరదలపై చైనా అత్యవసర హెచ్చరిక
- ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత శక్తివంతమైన టైఫూన్ గా నమోదు

**చైనా:** ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత బలమైన టైఫూన్ 'నౌల్' దక్షిణ చైనాలో బీభత్సం సృష్టిస్తోంది. ఆదివారం తెల్లవారుజామున గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ తీరాన్ని తాకిన ఈ టైఫూన్ కారణంగా హాంకాంగ్‌తో సహా పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. బలమైన గాలులు, భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు 7 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ఆది వారం ఉదయం 3:50 గంటల సమయంలో గ్వాంగ్‌డాంగ్‌లోని హుయిడాంగ్ కౌంటీ వద్ద నౌల్ తీరం దాటింది. ఆ సమయంలో గంటకు 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచాయి. ముందు జాగ్రత్త చర్యగా ఒక్క గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోనే 7,15,000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 'నౌల్' ఈ ఏడాది చైనాను తాకిన 12వ ఉష్ణమండల తుపాను కాగా, ఈ నెలలో ఇది మూడోది.టైఫూన్ ప్రభావం హాంకాంగ్‌పై తీవ్రంగా పడింది. ఆదివారం ఒక్కరోజే హాంకాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సుమారు 350 విమాన సర్వీసులను రద్దు చేశారు. దీంతో దాదాపు 2,000 మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టులోనే చిక్కుకుపోయారు. గ్వాంగ్‌డాంగ్‌లో రైలు సర్వీసులను కూడా పూర్తిగా నిలిపివేశారు. హాంకాంగ్‌లో ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. ఒక ఎత్తైన భవనానికి ఉన్న పరంజా (స్కాఫోల్డింగ్) కూలిపోగా, దాదాపు 9 మంది గాయపడినట్లు ప్రాథమిక సమాచారం.ప్రస్తుతం ఈ టైఫూన్ తీరం దాటి భూభాగంలోకి ప్రవేశించి క్రమంగా బలహీనపడిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అయినప్పటికీ, దీని ప్రభావంతో ఫుజియాన్, జియాంగ్సీ, హునాన్ వంటి దక్షిణ చైనాలోని పలు ప్రావిన్సులలో మంగళవారం వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో చైనా ప్రభుత్వం ఆకస్మిక వరదలపై అత్యున్నత స్థాయి హెచ్చరికలు (రెడ్ అలర్ట్) జారీ చేసింది. పర్వత ప్రాంతాలు, నదులు, లోయల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కొరియన్ భాషలో 'నౌల్' అంటే 'సూర్యోదయం లేదా సూర్యాస్తమయం వెలుగు' అని అర్థం.

## రేపటి నుంచి 'ఇంటింటికి తెలుగుదేశం': పల్లా శ్రీనివాసరావు

- ఎన్డీయే రెండేళ్ల పాలన విజయాలపై 45 రోజుల పాటు ప్రచారం
- సూపర్-6 హామీల అమలు తీరును ప్రజలకు వివరించనున్న టీడీపీ
- గత ప్రభుత్వ పాలనతో తేడాలను స్పష్టం చేయాలని శ్రేణులకు పిలుపు
- ప్రజల సమస్యలు, సూచనలు స్వీకరించనున్నట్లు వెల్లడి



అమరావతి, (సింధూర దర్శిని) 26 జూలై ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధమైంది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సారథ్యంలో 'ఇంటింటికి తెలుగుదేశం' పేరుతో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. రేపు సోమవారం (జులై 27) ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, "ఎన్డీయే ప్రభుత్వ రెండేళ్ల సుపరిపాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ వివరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. గత ఏడాది 'సుపరిపాలన తొలి ఏడాది' పేరుతో నిర్వహించిన కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లే, ఈసారి కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలి" అని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 హామీల అమలు తీరును, వాటి ద్వారా మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు పొందిన లబ్ధిని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు."గత ప్రభుత్వ విధ్వంసక పాలనకు, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ అభివృద్ధి పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి" అని పల్లా పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వ విజయాలు చెప్పడమే కాకుండా, ప్రజల నుంచి సమస్యలు, సూచనలను స్వీకరించి, వాటి పరిష్కారానికి పార్టీ, ప్రభుత్వం తరపున కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం, మిత్రపక్షాల సహకారంతో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులను ఆయన కోరారు.

## తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు... శిలాతోరణం వరకు క్యూలైన్లు

- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- సర్వదర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం
- వైకుంఠం కాంప్లెక్సులు నిండి శిలాతోరణం వరకు క్యూలైన్లు
- శనివారం 84 వేల మందికి పైగా భక్తులకు శ్రీవారి దర్శనం
- నిన్న రూ. 3.78 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

తిరుమల (సింధూర దర్శిని) 26 జూలై తిరుమల శ్రీవారి క్షేత్రం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. క్యూలైన్లు బయటకు విస్తరించి శిలాతోరణం వరకు బారులు తీరిన పరిస్థితి నెలకొంది.ఆదివారం కావడంతో రద్దీ మరింత పెరిగింది. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ యాత్రను ప్రణాళిక చేసుకోవాలని సూచిస్తున్నారు. నిన్న శనివారం (జులై 25) ఒక్కరోజే 84,488 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 37,061 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.78 కోట్లు వచ్చినట్లు టీటీడీ తెలిపింది. అదేవిధంగా, నిన్న 4.28 లక్షల లడ్డూలు విక్రయించగా, 2.74 లక్షల మందికి అన్నప్రసాదాన్ని అందించారు. వైద్య శిబిరాల్లో 3,789 మందికి చికిత్స అందించారు.

# సినిమా న్యూస్

## 'న్యూటన్స్ థర్డ్ లా' ట్రైలర్ పంచుకున్న నాగార్జున.. ప్రతి చర్యకు ఒక పర్యవసానం ఉంటుంది.. ఇది నిజం!




**సుమంత్ ఇన్వెస్టిగేషన్.. జగపతి బాబు యాక్షన్.. ఉత్కంఠగా 'న్యూటన్స్ థర్డ్ లా'**
**న్యూటన్స్ థర్డ్ లా' ట్రైలర్ పై నాగ్ వ్యాఖ్యలు**
**1999 నేపథ్యంలో సాగే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా చిత్రం**
**ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా సుమంత్, కిల్లర్‌గా జగపతి బాబు**

జూలై 31న థియేటర్లలో సినిమా విడుదల
"ప్రతి చర్యకు ఒక పర్యవసానం ఉంటుంది.. ఇది నిజం!!" అంటూ కింగ్ అక్కినేని నాగార్జున ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన మేనల్లుడు, నటుడు సుమంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'న్యూటన్స్ థర్డ్ లా' ట్రైలర్‌ను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలుపుతూ, సినిమా జూలై 31న థియేటర్లలోకి వస్తోందని ప్రకటించారు.
ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది.
రాజేష్ కర్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథ 1999లో జరుగుతున్నట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది.
"ఇప్పుడు కూడా నువ్వు చేసిన తప్పులు సరిదిద్దుకోవడానికి టైం ఉంది. ఆ అవకాశం అందరికీ రాదు" అనే వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమై ప్రేక్షకులను కథలోకి తీసుకెళుతుంది. "ఇది ఒక యాక్సిడెంట్ కేసు. కానీ అది యాక్సిడెంటా లేక మర్డరా అనేది తెలియదు" అని ఒక పోలీస్ అధికారి, ఇన్వెస్టిగేషన్ చేస్తున్న సుమంత్‌తో చెప్పడం కథలోని ఉత్కంఠను పరిచయం చేస్తుంది. వాసుదేవ్ అనే పాత్రలో నటిస్తున్న సుమంత్, "నిన్న రాత్రి అసలేం జరిగింది?" అని ప్రశ్నించడం ద్వారా తన దర్యాప్తును ప్రారంభించినట్టు చూపించారు.
మరోవైపు, కేవలం రూ. 20,000 కోసం ఏదో చిన్న పని పూర్తి చేయాలని ఇద్దరు యువకులు ఫోన్‌లో మాట్లాడుకోవడం కథలో మరో కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఇక జగపతి బాబు 'మెర్క్యురీ' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. "ప్రతి మెతుకు మీద తినేవాడి పేరు రాసి ఉంటుందంటారు. అదే నిజమైతే, తూటాలపై కూడా అవి ఎవరిని చంపుతాయో వారి పేర్లు రాసి ఉంటాయి" అంటూ ఆయన చెప్పే డైలాగ్ సినిమా తీవ్రతను తెలియజేస్తుంది. వరుస హత్యలు చేస్తూ కనిపించిన జగపతి బాబు పాత్రకు, యాక్సిడెంట్లుగా కనిపిస్తున్న నేరాలను ఛేదిస్తున్న సుమంత్ పాత్రకు మధ్య ఉన్న సంబంధం ఏమిటనేది ఆసక్తి రేకెత్తిస్తోంది. హరీశ్ కోహిర్కర్ నిర్మించిన ఈ చిత్రంలో అవసరాల శ్రీనివాస్, రవివర్మ, షెల్లీ ఎన్ కుమార్, త్రినాథ్ వర్మ, నేహా పఠాన్, పండిట్ గౌతమ్, హరిణి రావు గగనం, రూపేష్ మర్రపు, అభినయన ముఖ్య పాత్రలు పోషించారు. వేద వ్యాస్ గొట్టిపాటి సినిమాటోగ్రఫీ అందించగా, సింజిత్ యర్రమిల్లి సంగీతం సమకూర్చారు.
మొత్తం మీద, ఈ ట్రైలర్ ఒక ఇంటెలిజెంట్, గ్రిప్పింగ్ యాక్షన్ థ్రిల్లర్‌ను ప్రేక్షకులకు అందిస్తుందనే నమ్మకాన్ని కలిగిస్తోంది.

## 'టాక్సిక్' నుంచి యశ్ కొత్త లుక్.. కౌంట్‌డౌన్ పోస్టర్ అదిరింది!

యశ్ కొత్త సినిమా.. టాక్సిక్
రిలీజ్‌కు నెల ముందు.. రాకింగ్ స్టార్ ఇంటెన్స్ పోస్టర్!
ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా సినిమా రిలీజ్
కేజీఎఫ్ ఫ్రాంచైజీ తర్వాత యశ్ నటిస్తున్న భారీ ప్రాజెక్ట్
గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో నిర్మాణం
'కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన రాకింగ్ స్టార్ యశ్, తన తదుపరి చిత్రం 'టాక్సిక్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సినిమా విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం ఉన్న నేపథ్యంలో, చిత్ర బృందం యశ్ ఇంటెన్స్ లుక్‌తో కూడిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.
ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.
తాజాగా విడుదలైన ఈ పోస్టర్‌లో యశ్ స్టైలిష్‌గా, అంతే క్రూరంగా కనిపిస్తున్నారు. రక్తంతో తడిసిన చేతులతో, ప్రశాంతంగా సిగరెట్ కాలుస్తూ ఇంటెన్స్ లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. ఈ లుక్ సినిమాలోని హింసాత్మక ప్రపంచాన్ని సూచిస్తున్నప్పటికీ, కథపై ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండా ఉత్కంఠను పెంచుతోంది. "అతని చేతులకు రక్తం అంటింది" అనే క్యాప్షన్‌తో మేకర్స్ ఈ పోస్టర్‌ను పంచుకున్నారు.'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. యశ్‌తో కలిసి ఆమె ఈ కథను రాయడం విశేషం. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఏకకాలంలో రూపొందించి, పలు భారతీయ భాషల్లోకి డబ్ చేయనున్నారు. యశ్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హుమా ఖురేషి వంటి భారీ తారాగణం నటిస్తోంది.
కేజీఎఫ్ సిరీస్ వంటి భారీ బ్లాక్‌బస్టర్ల తర్వాత యశ్ నుంచి



వస్తున్న సినిమా కావడంతో 'టాక్సిక్'పై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## 'మా అబ్బాయి వస్తున్నాడు.. ఆదరించండి'..! జయకృష్ణ కోసం మహేశ్ బాబు ఎమోషనల్ అప్పీల్

- అన్న రమేశ్ బాబు కొడుకు జయకృష్ణ కోసం మహేశ్ బాబు ప్రచారం
- 'శ్రీనివాస మంగాపురం' సినిమాకు మద్దతుగా ప్రత్యేక వీడియో విడుదల
- తన 'రాజకుమారుడు' రిలీజ్ డేట్‌నే అబ్బాయ్‌కి కుదిరిందంటూ ఆనందం
- జయకృష్ణను ఆదరించాలని తన అభిమానులను కోరిన సూపర్ స్టార్

ఘట్టమనేని కుటుంబం నుంచి మరో హీరో వెండితెరకు పరిచయం అవుతున్న వేళ, సూపర్ స్టార్ మహేశ్ బాబు తన పూర్తి మద్దతు ప్రకటించారు. తన అన్నయ్య రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ హీరోగా నటిస్తున్న 'శ్రీనివాస




మంగాపురం' సినిమా కోసం మహేశ్ ఒక ప్రత్యేక వీడియోను తన సోషల్ మీడియాలో విడుదల చేశారు. తన అబ్బాయ్ జయకృష్ణను ఆశీర్వదించాలని ఆయన అభిమానులను కోరారు. ఈ వీడియోలో మహేశ్ బాబు మాట్లాడుతూ.. "మా అన్నయ్య అబ్బాయి జయకృష్ణ నటుడిగా పరిచయం అవుతుండటం చాలా ఆనందంగా ఉంది. మా కుటుంబమంతా ఎంతో ఎగ్జైటింగ్ గా ఎదురుచూస్తోంది. సినిమా టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ బాగున్నాయి. జయకృష్ణ, రాషా థడానీ జంట చూడముచ్చటగా ఉంది. వారిని అందంగా చూపించిన దర్శకుడు అజయ్ భూపతికి నా అభినందనలు" అని అన్నారు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని మహేశ్ పంచుకున్నారు. "ఈ సినిమా జులై 30న విడుదలవుతోంది. అదే రోజు నా మొదటి సినిమా 'రాజకుమారుడు' కూడా విడుదలైంది. నిర్మాత అశ్వినీదత్ గారే ఈ డేట్ ప్లాన్ చేసి ఉంటారని అనుకుంటున్నాను. వైజయంతి సంస్థ నుంచి నేను, రామ్ చరణ్, అల్లు అర్జున్ వచ్చాం. ఇప్పుడు జయకృష్ణ, రాషా కూడా అదే బ్యానర్ నుంచి వస్తున్నారు. ఇది వాళ్ల అదృష్టం. మా నాన్నగారి అభిమానులు, నా అభిమానులు జయకృష్ణ, రాషాలను ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని మహేశ్ తెలిపారు.

## రజనీకాంత్ ఆటోబయోగ్రఫీ.. త్వరలో బయోపిక్‌గా రానుందా?

- తన ఆటోబయోగ్రఫీని రాస్తున్న సూపర్ స్టార్ రజనీకాంత్
- పుస్తకం రాస్తున్న విషయాన్ని ఆయన కుమార్తె సౌందర్య గతంలోనే ధ్రువీకరణ
- ఈ జీవిత చరిత్రను బయోపిక్ సినిమాగా తీసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం
- ఇందులో బస్ కండక్టర్ నుంచి సూపర్ స్టార్‌గా ఎదిగిన ప్రస్థానంపై వివరణ
- ప్రస్తుతం రజనీకాంత్ 'జైలర్ 2', 'ధర్మాన్' సినిమాలతో బిజీ

భారతీయ సినిమా గర్వించదగ్గ నటుల్లో ఒకరైన సూపర్ స్టార్ రజనీకాంత్ జీవితం ఓ స్ఫూర్తిదాయక ప్రయాణం. బెంగుళూరులో ఒక సాధారణ బస్ కండక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. దశాబ్దాలుగా కోట్లాది మందికి ప్రేరణగా నిలుస్తున్న ఆయన జీవిత కథ త్వరలో సినిమాగా రానుందనే వార్తలు ఆసక్తిని రేపుతున్నాయి. కొంతకాలంగా రజినీకాంత్ తన ఆత్మకథ (ఆటోబయోగ్రఫీ) రాస్తున్నట్లు ప్రచారం జరుగుతుండగా, ఇప్పుడు దానిని బయోపిక్‌గా తెరకెక్కించే అవకాశాలు ఉన్నాయని కొత్త నివేదికలు వెల్లడిస్తున్నాయి. తాజా మీడియా కథనాల ప్రకారం.. రజనీకాంత్ తన ఆత్మకథను సినిమాగా మార్చే విషయంపై సన్నిహితులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మకథలో ఆయన జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలు, వృత్తిపరమైన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, మరపురాని క్షణాలను సమగ్రంగా పొందుపరచనున్నారని సమాచారం. ఈ పుస్తకాన్ని బయోపిక్‌గా తీస్తే ఎలా ఉంటుందనే దానిపై చర్చలు జరుగుతున్నప్పటికీ, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వార్త కోలీవుడ్‌లో జోరుగా ప్రచారంలో ఉంది. గతంలో రజనీకాంత్ కుమార్తె సౌందర్య కూడా తన తండ్రి ఆత్మకథ రాస్తున్న విషయాన్ని ధ్రువీకరించారు. "కష్టపడి తనకంటూ ఒక మార్గాన్ని సృష్టించుకున్న మా తలైవా, బెంగుళూరులో బస్ కండక్టర్‌గా తన పోరాటాల నుంచి కోలీవుడ్‌లో సూపర్‌స్టార్‌గా ఎదిగే వరకు తన జీవిత చరిత్రను రాయడం ప్రారంభించారు" అని ఆమె ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ పుస్తకం ఆయన జీవితం, కెరీర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను అందిస్తుందని, ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుందని సౌందర్య విశ్వాసం వ్యక్తం చేశారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో రజనీకాంత్ తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఎన్నో అద్భుతమైన చిత్రాల్లో నటించారు. భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్, పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే వంటి అత్యున్నత పురస్కారాలతో సత్కరించింది. ప్రస్తుతం ఆయన నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో 'జైలర్ 2' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీంతో పాటు అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో 'ధర్మాన్' అనే మరో చిత్రంలో కూడా ఆయన నటిస్తున్నారు.



Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662